# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
13-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 142

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## జనసేనలోకి రాజా సింగ్!

దాదాపు మూసుకుపోతున్న బిజెపి తలుపులు

ప్రత్యామ్నాయంగా పవన్ పార్టీ

తెర వెనుక చేరికకు రంగం సిద్ధం

**క్రైమ్ మిర్రర్,, తెలంగాణ బ్యూరో :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జనసేనలో చేరుతారా? బిజెపిలోకి రీఎంట్రీ కుదరకపోతే అదే పని చేయనున్నారా? ప్లాన్ బి రెడీ చేసుకుంటున్నారా?

2లో



## మహిళా బిల్లు ముద్దు.. డీలిమిటేషన్ వద్దు

ప్రస్తుత సంఖ్య ఆధారంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు

తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ తీర్మానం

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ

మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు



2లో

## తెలంగాణ కాంగ్రెస్ సమూల ప్రక్షాళన!

నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

ఏఐసీసీకి టిపిసిసి ప్రతిపాదనలు

త్వరలో నియామకాలు

తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ లు రానున్నారా? ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సామాజిక సమీకరణల ఫార్ములాను తెరపైకి తెచ్చిందా? రాష్ట్ర నాయకత్వానికి మార్గదర్శకాలు జారీ చేసిందా? అవునని సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఈ ప్రతిపాదనలపై టీ కాంగ్రెస్ నేతల మధ్య ఆసక్తికర చర్చ నడుస్తోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

ఇప్పటికే కొందరి పేర్లు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఏఐసీసీకి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ ల పేర్లను ప్రకటిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

**ప్రత్యేక ఫోకస్..**

తెలంగాణ కాంగ్రెస్ పై హై కమాండ్ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. 2028 ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీలో సమూల ప్రక్షాళన తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొత్త నాయకత్వ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీసీ సామాజిక వర్గానికి చెందిన

2లో

## గులాబీ పార్టీలోకి పోచారం!



### కెసిఆర్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు

అనవసరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించానని ఆవేదన

నియోజకవర్గ నిధులు లేవు.. సరైన గౌరవం దక్కడం లేదు

మాతృ పార్టీలో చేరేందుకు మాజీ స్పీకర్ డిసైడ్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** మొన్నటి ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడిపోవడంతో బాన్సువాడ నియోజకవర్గంలో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తో పాటు రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అయితే అక్కడ సరైన గుర్తింపు, గౌరవం దక్కకపోవడంతో తిరిగి గులాబీ పార్టీలో చేరేందుకు నిర్ణయం

2లో

తెలంగాణ సీనియర్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి తిరిగి గులాబీ పార్టీలో చేరుతారా? కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించి తప్పు చేశానని భావిస్తున్నారా? కెసిఆర్ పిలిస్తే తిరిగి ఆ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారా? అందుకే కెసిఆర్ అనుకూల వ్యాఖ్యలు చేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. కొద్ది రోజుల కిందట కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు పోచారం శ్రీనివాస్ రెడ్డి.

## కళ్యాణలక్ష్మికి బ్రేక్

షాదీ ముబారక్ పథకాన్ని కూడా..

నిలిపివేయాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈ పథకాలకు చట్టబద్దత లేదని కోర్టులో పిటిషన్

నాలుగు వారాలకు విచారణ వాయిదా

అప్పటివరకు లబ్ధిదారులకు చెల్లింపులు..

చేయవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు

ఆందోళనలో రెండు పథకాల లబ్ధిదారులు



2లో

తెలంగాణలోని పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక భరోసా ఇచ్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ



## విజయసాయిరెడ్డి కొత్త పార్టీ 'భారతీయ జన వికాస్'!

ఆగస్టు 15న ప్రకటన

డిజిటల్ మీడియా సైతం సిద్ధం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రభావం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటించనున్నారా? పార్టీ పేరును సిద్ధం చేశారా? ఆగస్టు 15న ప్రకటిస్తారా? ఈ మేరకు ముహూర్తం ఖరారు చేశారా? విజయ్ సాయి రెడ్డితో కలిసి నడిచేది ఎవరు? ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరతారనుకున్న విజయసాయిరెడ్డి యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు డిజిటల్ మీడియా, మరోవైపు

3లో

## రోజా అరెస్ట్?!

మాజీ మంత్రి చుట్టూ మూడు కేసులతో ఉచ్చు

తిరుమల దర్శనం టికెట్ల దుర్వినియోగం, ఆడుదాం ఆంధ్ర, రుషికొండ భవన నిర్మాణం కేసుల్లో..

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**

మాజీ మంత్రి రోజా అరెస్ట్ కాబోతున్నారా? ఆమె చుట్టూ ఉచ్చు బిగిస్తోందా? మూడు కీలకమైన కేసులు ఆమె మెడకు చుట్టుకోబోతున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. గత కొద్దిరోజులుగా రోజా అరెస్టుపై రకరకాలుగా ప్రచారం నడుస్తూ వస్తోంది.



2లో

## బిజెపిలో ఆపరేషన్ 'రివర్స్'!



### ఫలించని ఆకర్ష్

పార్టీలో చేరేందుకు నేతల విముఖత

దక్కని టిక్కెట్ల హామీ

చేరిన వారికి గౌరవం అంతంత మాత్రం

అందుకే ఈసారి నేరుగా హై కమాండ్ రంగంలోకి..

మున్ముందు పార్టీలో భారీగా చేరికలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఓటు శాతం పెంచుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీతో సమానంగా 8 ఎంపీ సీట్లను దక్కించుకుంది. దీంతో తెలంగాణలో బిజెపి బలమైన శక్తిగా ఎదుగుతుందని అంతా భావించారు. ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని అంచనా వేశారు. కానీ సార్వత్రిక ఎన్నికలు జరిగి రెండేళ్లు గడుస్తున్న.. పేరు మోసిన నేతలు బిజెపి వైపు

తెలంగాణలో బిజెపి ఆకర్ష్ ఫెయిల్ అయ్యిందా? బిజెపిలో చేరేందుకు నేతలు ఎందుకు ఆసక్తి చూపడం లేదు? రెండేళ్ల వ్యవధి మాత్రమే ఎన్నికలకు ఉండగా నాయకులు ఎందుకు ముందుకు రావడం లేదు? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో దీనిపైన ఆసక్తికర చర్చ. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి బలం పుంజుకుంది.

# రోజా అరెస్ట్?!



(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆమె మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన అవినీతిపై నివేదికలు వచ్చాయి. వాటిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఏ క్షణంలోనైనా రోజా అరెస్టు తప్పదన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో నడుస్తోంది.

**దూకుడు కలిగిన నేత..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు కలిగిన నేతల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా ఒకరు. ఇప్పటికీ ఆమె దూకుడు అలానే కొనసాగుతూ వస్తోంది. చంద్రబాబుతో పాటు పవన్ విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. ఇప్పటికీ మంత్రి లోకేష్ ను టార్గెట్ చేస్తూ వచ్చారు. అయితే గత రెండేళ్లలో రోజా అరెస్టుపై రకరకాల ప్రచారం సాగింది. కానీ మహిళా నేతల విషయంలో కూటమి ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు వార్తలు వచ్చాయి. అయితే రోజా మాత్రం ఏ విషయంలోను వెనక్కి తగ్గడం లేదు. అందుకే ఆమెను టార్గెట్ చేసుకుంటూ పాత కేసులను తిరగదోడాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. సరిగ్గా అదే సమయంలో ఆ కీలక కేసులకు సంబంధించిన నివేదికలు.. నాటి ప్రభుత్వ వైఫల్యాలు నిర్ధారణకు రావడంతో ఏ క్షణంలోనైనా రోజా అరెస్టు ఉంటుందన్న టాక్ నడుస్తోంది.

**తిరుమల టిక్కెట్లు దుర్వినియోగం..**

వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగా వ్యవహరించారు ఆర్కే రోజా. పర్యాటకశాఖ తో పాటు క్రీడల శాఖ మంత్రిగా ఉండేవారు. అప్పట్లో మంత్రి హోదాలో తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లను దుర్వినియోగం చేశారన్న ఆరోపణ ఆమెపై ఉంది. ప్రతి పర్వదినాన పదుల సంఖ్యలో అనుచరులను వెంటబెట్టుకొని మరి ఆమె తిరుమలలో హల్చల్ చేసేవారు. కొండపైనే రాజకీయాల గురించి మాట్లాడేవారు. అయితే ఆమె సర్వదర్శనాలకు సంబంధించిన టిక్కెట్లు అమ్ముకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై మీడియాలో సైతం చాలా రకాల కథనాలు వెలువడ్డాయి.

**ఆడుదాం ఆంధ్రాలో అవినీతి..**

మరోవైపు ఆడుదాం ఆంధ్ర పేరుతో భారీ అవకతవకలకు పాల్పడ్డారు అన్న ఆరోపణలు రోజాపై వచ్చాయి. ఆమె క్రీడల మంత్రిగా ఉన్నప్పుడు క్రీడా పోటీలు నిర్వహించారు. అప్పట్లో ఈ పోటీలకు అవసరమైన క్రీడా పరికరాల కొనుగోలులో 100 కోట్ల రూపాయల వరకు గోల్మాల్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులను క్రీడాకారులుగా చూపి భారీగా నిధులు పక్కదారి పట్టించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. క్రీడల శాఖ అధికారులు సిబ్బంది స్థానంలో వలంటీర్లతో క్రీడా పోటీలు నిర్వహించడం.. ఆ పోటీలకు సంబంధించిన నిర్వహణ ఖర్చులను సైతం పక్కదారి పట్టించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. క్రీడా పరికరాల సరఫరా బాధ్యతలు అప్పగించే ఏజెన్సీల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడ్డారు అన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఆమెతోపాటు అప్పటి శాప్ చైర్మన్గా ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై సైతం ఈ ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విజిలెన్స్ విచారణ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు విజిలెన్స్ తేల్చింది. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

### అడ్డగోలుగా రుషికొండ భవనాలు..

మరోవైపు తాజాగా రుషికొండ భవనాల విషయంలో సైతం పర్యాటక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో పర్యాటక శాఖ మంత్రిగా రోజా ఉండేవారు. అప్పట్లో అన్ని ఫైళ్లపై ఆమె సంతకాలు చేశారు. దీంతో ఆమె చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే త్వరలో ఆమె అరెస్టు ఉంటుందన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో ఉంది. అయితే మహిళా నేతను అరెస్టు చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిగా మార్చుకునే అవకాశం ఉంది. అందుకే కేసుల విచారణ పేరుతో ఆమెను నోటీసులు ఇచ్చి తిప్పుతారని తెలుస్తోంది.

# బిజెపిలో ఆపరేషన్ 'రివర్స్'!

**చూడకపోవడం ఆ పార్టీకి చాలా లోటు.**

**చాలామంది ఆసక్తి..**

వాస్తవానికి చాలామంది నాయకులు బిజెపిలో చేరేందుకు ఆసక్తి చూపారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం.. తెలంగాణలో ఏకంగా 8 ఎంపీ సీట్లను దక్కించుకోవడం చూసి చాలామంది నాయకులు బిజెపిలో చేరేందుకు ఆసక్తి చూపారు. కానీ వారిని పార్టీలోకి తీసుకెళ్లడంలో నాయకత్వం విఫలమైంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ పై స్పష్టత ఇవ్వలేకపోవడం ప్రధాన లోటు. పార్టీలోకి వస్తే హోదా, గౌరవం పై కూడా సరైన హామీ ఇవ్వకపోవడంతో చాలామంది నేతలు అడుగులు వేశారు వెనక్కి. ఆపై బిజెపిలో కొత్త, పాత అనే విభజన రేఖ ఉంటుంది అనేది బలమైన ప్రచారం. దానికి భయపడి కూడా చాలామంది నేతలు బిజెపిలో చేరకుండా ఉన్నారు. పార్టీలో కొందరికే ప్రాధాన్యం ఉంటుందని.. కొత్తగా చేరేవారికి కనీస స్థాయిలో కూడా గౌరవం ఉండదన్న అభిప్రాయం బలంగా బయటకు వచ్చింది. అందుకే కమలం వైపు నేతలు కనీసం చూడలేదని తెలుస్తోంది.

**వారంతా యూ టర్న్..**

చాలామంది సీనియర్ నేతలు బిజెపిలో చేరారు గతంలో. కాంగ్రెస్ పార్టీతో పాటు తెలంగాణ రాష్ట్ర సమితిలో పనిచేసిన నాయకులు సైతం బిజెపిలో చేరారు.



కానీ అక్కడ ఇమడలేక బయటకు వచ్చేసారు. పెద్దపల్లి వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నాగం జనార్దన్ రెడ్డి, దాసోజు శ్రవణ్ లాంటి పెద్ద పెద్ద నేతలు ఉండలేకపోయారు బిజెపిలో. దానికి కారణం పార్టీలో సరైన గౌరవం దక్కకపోవడమే. ఈటెల రాజేందర్ లాంటి రాష్ట్ర నాయకుడు బిజెపిలో చేరిన తర్వాత నామమాత్రం అయ్యారు. ఆయనకంటే మేమే సీనియర్లను అని.. పార్టీ పాత నేతలం అంటూ చాలామంది నేతలు ఆయనతో విభేదం పెట్టుకున్నారు. పార్టీలో చేరిన వారి విషయంలో కనీస మర్యాద దక్కకపోవడంతో చాలామంది యూటర్న్ అయ్యారు. ఆ పరిస్థితిని చూసి కొత్తగా చేరాలనుకునే వారు సైతం వెనుకడుగు వేశారు.

**గ్రామీణ ప్రాంతాల్లో చాలా కష్టం..**

ప్రస్తుతం పట్టణాలతో పాటు నగరాల్లోనే బిజెపి పరిస్థితి బాగుంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పెద్దగా బాగాలేదు. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం లేదు. అయితే ప్రారంభంలో ఆపరేషన్ ఆకర్ష పేరుతో ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాలని భారీ ప్రణాళిక వేశారు. కానీ క్షేత్రస్థాయిలో పార్టీలో అనుకూల పరిస్థితి లేదు. అందుకే పార్టీలో చేరికలు పెరగలేదు. ఉన్నది తక్కువ సమయం మాత్రమే. ఈ సమయంలో మళ్లీ వలసలు ప్రారంభం కావాలని.. పార్టీలో చేరికలు పెరగాలని బిజెపి అగ్ర నేతలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మరి కొద్ది రోజుల్లో బిజెపిలో భారీగా నేతలు చేరిక ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# కళ్యాణలక్ష్మికి బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

ముబారక్ పథకాలకు బ్రేక్ పడింది. ఈ పథకాలకు చట్టబద్ధత లేదంటూ హైకోర్టులో దాఖలైన పిటిషన్పై విచారణ జరిపిన ధర్మాసనం.. వీటిని వెంటనే నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ చేపట్టే వరకు ఈ రెండు పథకాల కింద చెల్లింపులు కూడా చేయవద్దని ఆదేశించింది. దీంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు.. వారికి పెళ్లిచేసేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కళ్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద ఆడపిల్ల పెళ్లికి రూ.లక్ష సాయాన్ని ప్రభుత్వం తరపున అందించాలని నిర్ణయించారు. కేసీఆర్ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. హిందువులకు కళ్యాణలక్ష్మి పేరుతో, ముస్లింలకు షాదీ ముబారక్ అనే పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఈ రెండు పథకాలను కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా అమలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను చట్టసభల్లో ప్రత్యేక చట్టం లేదా తీర్మానం లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోలు) ఆధారంగా అమలు చేస్తున్నారంటూ న్యాయవాది విజయ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాధనంతో భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ఈ



పథకాలకు తగిన చట్టబద్ధత లేదని పిటిషన్లో పేర్కొన్నారు. ఈ అంశంపై గతంలోనే విచారణ జరిపిన హైకోర్టు.. పిటిషన్కు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే 4 వారాలు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం తన కౌంటర్ను సమర్పించలేదు. దీంతో పిటిషనర్ ఈ విషయాన్ని తిరిగి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని హైకోర్టు పరిశీలించి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద చెల్లింపులు నిలిపివేయాలని ఆదేశించింది. ఆ తర్వాత కేసు విచారణను 4 వారాల పాటు వాయిదా వేసింది. సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో కొత్తగా చెల్లింపులు పొందాల్సిన లబ్ధిదారుల పరిస్థితిపై ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమర్పించే కౌంటర్, తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయం.. ఈ రెండు పథకాల అమలు కీలకంగా మారనుంది.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷-లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# మహిళా బిల్లు ముద్దు.. డీలిమిటేషన్ వద్దు

చెన్నై,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది.లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగు తుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న వార్తలు వచ్చాయి.

# జనసేనలోకి రాజా సింగ్!



అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తెలంగాణ బిజెపి నాయకత్వాన్ని ఆశించిన రాజాసింగ్.. అది దక్కకపోయేసరికి పార్టీకి రాజీనామా చేశారు. ఆయన చర్యలతో విసిగి వేసారి పోయిన పార్టీ హై కమాండ్ రాజీనామాను ఆమోదించింది. అయితే గత కొద్ది రోజులుగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ద్వారా బిజెపిలో రీఎంట్రీకి రాజాసింగ్ ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ వర్క్ అవుట్ కావడం లేదు. ఈ తరుణంలో రాజాసింగ్ జనసేన లో చేరేందుకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**జనసేన పై కీలక వ్యాఖ్యలు..**

రెండు రోజుల కిందట రాజాసింగ్ జనసేన పై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో జనసేనకు భవిష్యత్తు ఉందంటూ వ్యాఖ్యానించారు. యూత్ లో పవన్ కళ్యాణ్ కు విపరీతమైన క్రేజ్ ఉందని పొగడ్తల వర్షం కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయాలని సూచించారు. కాంగ్రెస్ తో పాటు భారత రాష్ట్ర సమితికి జనసేన ప్రత్యామ్నాయం అని తేల్చి చెప్పారు. అయితే ఆయన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తెలంగాణలో బిజెపి ఒంటరి పోరాటంపై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఇటువంటి సమయంలోనే తెలంగాణలో జనసేనకు భవిష్యత్తు ఉందని చెప్పడం ద్వారా సంచలనానికి తెరలేరు ఒకప్పటి బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే ఆయన జనసేనలో చేరడం ఖాయమని తెలుస్తోంది. ప్రస్తుతం ఆయనకు ఉన్న ఏకైక ఆప్షన్ కూడా జనసేన అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**హ్యాట్రిక్ ఎమ్మెల్యే..**

గోషామహల్ నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు రాజాసింగ్. తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఆయన 2009లో ఆ పార్టీ అభ్యర్థిగా గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ కార్పొరేటర్ గా పోటీ చేసి గెలిచారు. తరువాత బిజెపిలోకి ఎంట్రీ ఇచ్చారు. 2014లో గోషామహల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2018లో సైతం రెండోసారి గెలిచి రికార్డు సృష్టించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పోటీ చేసి గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే ప్రతిసారి పార్టీతో వివాదం పెట్టుకోవడం రివాజుగా మారింది. పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని విభేదిస్తూ వ్యాఖ్యలు చేస్తే రాజాసింగ్ విషయంలో బిజెపి హై కమాండ్ సీరియస్ గా ఉంది. పలుమార్లు ఆయనపై సస్పెన్షన్ వేటు పడటం.. తర్వాత హై కమాండ్ ఎత్తివేయడం పరిపాటిగా మారింది. అయితే ఈసారి ఆయనకు బిజెపిలో చేరిక కష్టమేనని తెలుస్తోంది. అందుకే రాజాసింగ్ జనసేనలో చేరికకు రంగం సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.




## తెలంగాణ కాంగ్రెస్ సమూల

# ప్రక్షాళన!

మహేష్ కుమార్ గౌడ్ టిపిసిసి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అందుకే మిగతా వర్గాలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలని హై కమాండ్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగానే ఎస్సీ, ఎస్టి, మైనారిటీ, అగ్రవర్ణాల నుంచి ఒక్కొక్కరిని వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించే ప్రతిపాదనను రూపొందించినట్లు తెలుస్తోంది. పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్యం అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చలు జరిపినట్లు సమాచారం. కొందరి పేర్లను ఫైనల్ చేస్తూ ఏఐసీసీకి ఒక నివేదిక పంపినట్లు తెలుస్తోంది.

**అందర్నీ సంతృప్తి పరిచేందుకు..**

కాంగ్రెస్ పార్టీలో ఉన్న అన్ని సామాజిక వర్గాలను సంతృప్తి పరిచేందుకు హైకమాండ్ ఈ నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ ల ఫార్ములాను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో సీనియారిటీ, కుల, ప్రాంతీయ, రాజకీయ అంశాలను పరిగణలోకి తీసుకొని పలువురి సీనియర్ నాయకుల పేర్లను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎస్సీ వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎస్టి వర్గం నుంచి మాజీ కేంద్రమంత్రి కోరిక బలరాం నాయక్ పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మైనారిటీలకు సంబంధించి మహమ్మద్ అజ్మతుల్లా, ఒబైదుల్ల కోత్వాల్ పేర్లు తెరపైకి వచ్చాయి. అగ్రవర్ణాలకు సంబంధించి రోహిన్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రోహిన్ రెడ్డి రేవంత్ రెడ్డికి సన్నిహితుడు. పద్మావతి రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి. పార్టీ సంస్థాగత కీలక పదవుల్లో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించాలన్న డిమాండ్ మేరకు పద్మావతి రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. నలుగురి పేర్లపై టీపీసీసీ నాయకులు తుదికసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. త్వరలోనే వీరి నియామకానికి సంబంధించి ఏఐసిసి నాయకత్వం ప్రత్యేక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి.

# గులాబీ పార్టీలోకి పోచారం!



(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది.

**భావోద్వేగ ప్రకటన..**

రెండు రోజుల కిందట పోచారం శ్రీనివాస్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. తాను మంత్రి పదవి కోసమో.. లేక డబ్బుల కోసమో కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని తేల్చి చెప్పారు. కేవలం బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం కోసమే పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు కూడా చేశారు.. కెసిఆర్ ను మోసం చేసి భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారడం తనకు ఎంత మాత్రం ఇష్టం లేదని వాపోయారు. అయితే నియోజకవర్గ అభివృద్ధి కోసం.. పెండింగులో ఉన్న పనులకు నిధులు రావాలని ఉద్దేశంతోనే తాను కాంగ్రెస్లో చేరాల్సి వచ్చిందని వివరించారు. తాను స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారలేదని వ్యాఖ్యానించారు. అన్నం పెట్టిన వాళ్లను ఎప్పటికీ మర్చిపోలేని పేర్కొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి.. కెసిఆర్ హయాంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కొంతమంది నీచుల కారణంగానే తాను పార్టీ మారాల్సి వచ్చిందని కూడా వ్యాఖ్యానించారు.

**మారిన మనసు..**

పరిస్థితులు చూస్తుంటే మాత్రం పోచారం శ్రీనివాస్ రెడ్డి మనసు మార్చుకున్నట్లు స్పష్టమవుతుంది. కెసిఆర్ పట్ల అనుకూల వ్యాఖ్యలు చూస్తుంటే.. గులాబీ పార్టీ నుంచి సానుకూలత వస్తే పార్టీలో చేరేందుకు సిద్ధమని సంకేతాలు పంపినట్లు అయింది. ఉమ్మడి రాష్ట్రంలోనే పోచారం శ్రీనివాస్ రెడ్డి సీనియర్ మోస్ట్ లీడర్. తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఆయన.. 1989లో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1998లో ఆయనకు తొలిసారిగా మంత్రి పదవి లభించింది. 1999లో రెండోసారి బాన్సువాడ నుంచి గెలిచారు పోచారం శ్రీనివాస్ రెడ్డి. చంద్రబాబు క్యాబినెట్లో మంత్రి కూడా అయ్యారు. 2004లో బాన్సువాడ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2009లో మాత్రం గెలిచారు. 2011లో టిడిపి తో పాటు ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసి టిఆర్ఎస్ లో చేరారు. ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2014లో సైతం టిఆర్ఎస్ తరఫున గెలిచి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2018లో గెలిచి శాసనసభ స్పీకర్ అయ్యారు. 2023లో భారత రాష్ట్ర సమితి తరపున పోటీ చేసి గెలిచారు. అయితే కొద్ది కాలానికి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. ఇప్పుడు యూటర్న్ తీసుకునేలా ఉన్నారు. తిరిగి గులాబీ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# విజయసాయిరెడ్డి కొత్త పార్టీ 'భారతీయ జన వికాస్'!

రాజకీయాల్లో బిజీ కావాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే ఏపీలో పెను మార్పులు రావడం ఖాయం.

**పొలిటికల్ రీఎంట్రీ**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకొని మరి పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇకనుంచి రాజకీయాలు చేయనని.. వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. కానీ ఆ మాట మీద ఉండలేకపోయారు. మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తానని మొన్న ఆ మధ్యన ప్రకటన చేశారు. పనిలో పనిగా డిజిటల్ మీడియా సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. అది తుది దశకు చేరుకోవడంతో.. ఇప్పుడు పార్టీ స్థాపన పై పడ్డారు. వివిధ రంగాల ప్రముఖులను సైతం ఆశ్రయించి వారి సలహాలు తీసుకున్నారు. సీనియర్ రాజకీయ నాయకులతో పాటు బ్యూరోక్రాట్ వ్యవస్థలో అనుభవజ్ఞుల సలహాలను పొందారు. పార్టీపై పూర్తి కసరత్తు పూర్తి చేశారు. ఆగస్టు 15న పార్టీని ప్రకటిస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**హిందుత్వ వాదంతో..**

విజయసాయిరెడ్డి ఏర్పాటు చేయబోయే పార్టీ పేరు భారతీయ జన వికాస్ అని తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీకి దగ్గరగా ఉండేందుకు వీలుగా బిజెవి పార్టీని రూపకల్పన చేసినట్లు సమాచారం. జాతీయ సమైక్యతావాదం.. ఆపై హిందుత్వ భావజాలంతో ఈ పార్టీని నిలబెడతారని ప్రచారం జరుగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేసిన విజయసాయిరెడ్డి అక్కడ హిందుత్వ వ్యతిరేకత ముద్రను దక్కించుకున్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చాక బిజెపిలో చేరుతారని అంతా అనుకున్నారు. కానీ కూటమి నుంచి అభ్యంతరాలు రావడంతో అది వర్కౌట్ కాలేదు. అందుకే ఇప్పుడు హిందుత్వవాదంతో ఒకసారి కొత్త పార్టీని ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చారు. తన భారతీయ జన వికాస్ పార్టీని ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం నాడు ప్రకటిస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కచ్చితంగా దీని ప్రభావం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై ఉంటుంది అనేది విశ్లేషకులు మాట. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

### వాటాల్లో బీఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం

### అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్

### మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,ఆగస్ట్: తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# చర్చకు తానెప్పుడూ సిద్ధమే

### చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం.. హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ

న్యూఢిల్లీ,: పార్లమెంట్లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్కు వస్తున్నాను. నా ఛాంబర్లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.అమిత్షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఆగస్ట్1: గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

### బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం

న్యూఢిల్లీ,ఆగస్ట్12: రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్ను తాము సమర్థించమని స్పష్టం చేశారు.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



## శుభ కార్యాక్రమాలకు అనువైన మాసం

## అనేక పూజాది వ్రతాలకు పవిత్ర మాసం

# నేటినుంచి శ్రావణ మాసం ప్రారంభం

హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం విశిష్టమైనదిగా భావిస్తారు. చాంద్రమానం ప్రకారం.. తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. పౌర్ణమి తిథి రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే.. స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రావణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా హిందు ఆచారాన్ని పాటించే వారి నమ్మకం.దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణోక్తి.. తిథులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణ మాసంలో శివ కేశవులను నిష్టతో, అత్యంత భక్తి శ్రద్దలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈమాసంలో ప్రతి రోజూ విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని నమ్మకం. వివాహాది శుభకార్యాలకు, మంగళ గౌరీ నోములకు, వరలక్ష్మి వ్రతానికి, అన్నాచెల్లెళ్ల బంధాన్ని ముడివేసే రాఖి పౌర్ణమి వంటి పండుగలకు శ్రావణ మాసం పెట్టింది పేరు. తెలుగు పంచాంగం ప్రకారం ఐదో మాసమైన శ్రావణ మాసంలో పండుగలు, వ్రతాలతో పాటు శుభకార్యాలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. అందుకే శ్రావణ మాసాన్ని శుభాల మాసమని అంటారు. శుభాల మాసమైన శ్రావణ మాసంలో పౌర్ణమి నాటి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణ మాసమని పేరు వచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో ఏ పని చేసినా శు భకరమని భావిస్తారు. శ్రావణంలో రానున్న పుణ్య తిథులు - పండుగలు ఇలావున్నాయి. ఆగస్టు 13, గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. ఆగస్టు 13, గురువారం శ్రావణ శుద్ధ పాడ్యమి: శ్రావణ మాసం ప్రారంభంగస్టు 14, శుక్రవారం శ్రావణ శుద్ధ విదియ చంద్రోదయం, శ్రావణ మాసం మొదటి శుక్రవారం, ఆండాళ్ తిరు నక్షత్రం, ఆండాళ్ తిరుపురంగా భావిస్తారు. ఆగస్టు 15, శనివారం శ్రావణ శుద్ధ తదియ. శ్రీనివాసుడికి ఇష్టమైన రోజు. ఆగస్టు 16, ఆదివారం, శ్రావణ శుద్ధ చవితి: నాగ చతుర్థి, కశ్యప మహర్షి జయంతి కూడా. ఆగస్టు 17, సోమవారం, శ్రావణ శుద్ధ పంచమి: నాగ పంచమి, గరుడ పంచమి, సింహ సంక్రమణం, శృంగేరి శ్రీ విధుశేఖర భారతీతీర్థ స్వామి వారి జన్మదినం, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఆగస్టు 18, మంగళవారం శ్రావణ శుద్ధ షష్టి: కల్కి జయంతి. ఆగస్టు 21, శుక్రవారం శ్రావణ శుద్ధ నవమి: శ్రీ వరలక్ష్మి వ్రతం, శ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి, తిరుచానూరు శ్రీ పద్మావతి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహిస్తారు. ఆగస్టు 22, శనివారం శ్రావణ శుద్ధ దశమి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. ఆగస్టు 23, ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి: సర్వ ఏకాదశి, శ్రావణ పుత్రదా ఏకాదశి అని కూడా అంటారు. ఆగస్టు 25, మంగళవారం శ్రావణ శుద్ధ త్రయోదశి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు సమాప్తి, పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. ఆగస్టు 26, బుధవారం శ్రావణ శుద్ధ చతుర్దశి: ఓనం పండుగ, రుగ్వేదీనాం ఉపాకర్మ, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు సమాప్తి కానున్నాయి. ఆగస్టు 28, శుక్రవారం శ్రావణ శుద్ధ పౌర్ణమి: రాఖీపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, వైఖానస మహాముని జయంతి, హయగ్రీవ జయంతి, శ్రావణాల పౌర్ణమి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు నక్షత్రం, మృకండ మహర్షి జయంతి కూడా. ఆగస్టు 29, శనివారం శ్రావణ బహుళ పాడ్యమి: గాయత్రీ జపాలకు మంచిది. ఆగస్టు 30, ఆదివారం శ్రావణ బహుళ విదియ: శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన దినోత్సవం. ఆగస్టు 31, సోమవారం శ్రావణ బహుళ తదియ/ చవితి: పుబ్బ కార్తె ప్రారంభం, సంకష్టహర చవితి కూడా. సెప్టెంబర్ 2, బుధవారం శ్రావణ బహుళ పంచమి/షష్టి: బలరామ జయంతి, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం. సెప్టెంబర్ 4, శుక్రవారం శ్రావణ బహుళ అష్టమి: గోకులాష్టమి, శ్రీ కృష్ణాష్టమి, జన్మాష్టమి, తిరుమల శ్రీవారి ఆస్థానం, గోశాలలో గోపూజ, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు సమాప్తం. సెప్టెంబర్ 5, శనివారం శ్రావణ బహుళ నవమి: గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం. సెప్టెంబర్ 7, సోమవారం శ్రావణ బహుళ ఏకాదశి: సర్వ ఏకాదశి. సెప్టెంబర్ 8, మంగళవారం శ్రావణ బహుళ ద్వాదశి/ త్రయోదశి: పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. సెప్టెంబర్ 9, బుధవారం శ్రావణ బహుళ చతుర్దశి: మాసశివరాత్రి. సెప్టెంబర్ 11, శుక్రవారం శ్రావణ బహుళ అమావాస్య: పోలాల అమావాస్య ఈ రోజుతో శ్రావణ మాసం సమాప్తమవు తుంది. శ్రావణ మాసంలో రానున్న పండుగలను శాస్త్రంలో సూచించిన విధంగా, పురాణాల ప్రకారం జరుపుకుంటే మంచిది.

**రెండు హృదయాలు ఒక్కటైనప్పుడు అక్కడ కేవలం భౌతికమైన సాన్నిహిత్యం మాత్రమే ఏర్పడదు. అది అనుభూతుల కలబోతగా, మధుర జ్ఞాపకాల నిధిగా, నిరంతర అంతర్గత సంభాషణగా రూపాంతరం చెందుతుంది. కాలం గడిచేకొద్దీ శరీరాలు వేరైనా, మనుషుల మధ్య దూరం పెరిగినా ఆ బంధపు మూలాలు ఎన్నటికీ అంతరించిపోవు. నిత్య జీవితంలో మనం సాధారణంగా వాడే విడిపోవడం అనే మాటకు సంబంధం శాశ్వతంగా ముగిసిపోయింది అనే అర్థాన్ని ఆపాదిస్తుంటాం. కానీ మానసిక విశ్లేషణ, లోతైన తత్వశాస్త్రం ఈ ధోరణిని నిర్ద్వంద్వంగా ప్రశ్నిస్తున్నాయి. దూరం అనేది కేవలం పరిసరాల పరమైన మార్పేనా, లేక అది ఆ అనుబంధానికి సరికొత్త రూపాన్ని ఇస్తుందా అనే ప్రశ్నలు సహజంగానే ఉదయిస్తాయి.**



# దూరం చెరపలేని బంధం... కాలం దాటని అనుబంధం

విరహం, శూన్యత కాదు గాఢతకు గీటురాయి .విరహం అనేది నిరాశాజనకమైన శూన్య స్థితి మాత్రమే కాదు, అది ఆత్మీయతకు సజీవ నిదర్శనం. ఒక మనిషి మన జీవితంలో ప్రాధాన్యతను కోల్పోతే, వారు దూరమైనప్పుడు మనసులో ఎలాంటి అలజడి ఉండదు. విరహం హృదయాన్ని మెలిపెడుతోందంటే, ఆ అనుబంధం ఇంకా అంతరంగంలో సజీవంగా తుడుచుపెట్టుకుపోకుండా ఉందని గ్రహించాలి. వేదాంతులు, విశ్లేషకులు స్పష్టం చేస్తున్నట్లుగా అంతర్మథనం, వేదన అనేవి అనుబంధపు లోతుకు తిరుగులేని రుజువులు. మనం దేనినైనా కోల్పోయి బాధపడుతున్నామంటే, అది మన జీవన ప్రయాణంలో అత్యంత విలువైనదిగా మిగిలిందని అర్థం. అందువల్ల విరహం ఎప్పటికీ ముగింపు కార్డు కాదు, అది ఆత్మీయత ఎంత పటిష్టమైనదో తెలియజేసే ప్రబలమైన గీటురాయిగా నిలుస్తుంది.కాలానికి అతీతమైన భావోద్వేగ వారధి మానవ మేధ జ్ఞాపకాలను కేవలం గణాంకాలుగానో, యాంత్రిక సమాచారంగానో భద్రపరచదు. వాటిని సున్నితమైన భావోద్వేగాలతో ముడిపెట్టి గుండెల్లో పదిలపరుస్తుంది. కలిసి పంచుకున్న క్షణాలు, ఆత్మీయ నవ్వులు, పలకరింపులు, పంచుకున్న గాఢమైన నిశ్శబ్దాలు అన్నీ స్మృతిపథంలో చెరగని ముద్రలుగా శాశ్వతంగా నిలిచిపోతాయి. భౌతికంగా వారు నిష్క్రమించినప్పటికీ, వారు మిగిల్చిన ఆనవాళ్లు ఆలోచనా విధానాన్ని, దైనందిన నిర్ణయాలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఈ కోణంలో పరిశీలిస్తే బంధం అనేది ఇరువురి మధ్య జరిగే శారీరక ఇచ్చిపుచ్చుకోవడం మాత్రమే కాదు. అది ఒక వ్యక్తి మరొకరి అంతఃచేతనపై వేసే ప్రగాఢమైన ముద్ర. ఆ ముద్ర చెదరకుండా ఉన్నంత కాలం, ఆ సంబంధం ఏదో ఒక అదృశ్య రూపంలో ప్రవహిస్తూనే ఉంటుంది. దూరం చెరపలేని అనుబంధ తీరాలు ప్రముఖ మనస్తత్వవేత్తలు ప్రతిపాదించిన అటాచ్‌మెంట్ థియరీ ప్రకారం, గాఢమైన అనుబంధం మానసిక నిర్మాణంలో అంతర్భాగంగా మారుతుంది. ఇది నిరంతర భౌతిక సాన్నిహిత్యంపై మాత్రమే ఆధారపడి ఉండదు. కన్నతల్లి బిడ్డకు సుదూర తీరాల్లో ఉన్నా మాతృప్రేమ చెక్కుచెదరదు. ప్రాణస్నేహితుడు ఖండాంతరాలు దాటి వెళ్లినా, దశాబ్దాల తర్వాత కలిసినా అదే వెచ్చదనం వెల్లివిరుస్తుంది. బంధాలు కాలం, సరిహద్దులనే సంకెళ్లకు లొంగవు. అవి ఆలోచనల్లో, అనుభూతుల్లో నిరంతరం పరిమళిస్తాయి. అయితే దూరం ఏ మార్పునూ తీసుకురాదని భావించలేం. సంబంధం తన రూపాన్ని మార్చుకుంటుంది. ప్రతిరోజూ సాగే మాటలు అపురూప జ్ఞాపకాలుగా మారవచ్చు. ఆప్యాయ స్పర్శ నిశ్శబ్ద ప్రార్థనగా స్థిరపడవచ్చు. ఇది ముగింపు ఎంతమాత్రం కాదు, పరిణామక్రమం మాత్రమే. కర్మ సిద్ధాంతం నుంచి అస్తిత్వవాదం దాకా భారతీయ సనాతన తత్వశాస్త్రం సంబంధాలను జన్మజన్మల కర్మ బంధాలుగా విశ్లేషిస్తుంది. ఇవి ప్రాపంచిక సరిహద్దులను సైతం సునాయాసంగా అధిగమిస్తాయని ప్రబోధిస్తుంది. పాశ్చాత్య అస్తిత్వవాదులు కూడా ఇదే వాస్తవాన్ని సమర్థిస్తూ, మన జీవితంలోకి ప్రవేశించిన ప్రతి వ్యక్తీ మన వ్యక్తిత్వంలో కొంత భాగాన్ని మార్చివేస్తారని చెబుతారు. ఈ మార్పు చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాబట్టి ఎడబాటు అనేది తాత్కాలిక సంఘటన మాత్రమే. అది అంతర్గత మానసిక, ఆధ్యాత్మిక వాస్తవికతను ఎన్నటికీ తుడిచిపెట్టలేదు.విడిపోవడం అనేది జీవిత పుస్తకంలో ఒక అధ్యాయం ముగియడం కావచ్చేమో కానీ, మొత్తం పుస్తకాన్ని దగ్ధం చేయడం కాదు. భౌతిక ఎడబాటు తీవ్రతను కొంత మేర తగ్గించవచ్చు గాక, కానీ అది నేర్పిన జీవన పాఠాలను, అందించిన పరిపక్వతను ఎవరూ చెరిపివేయలేరు. నిజమైన బంధం అంటే కళ్లెదుట కనిపించడం మాత్రమే కాదు. ఇరు మనసుల మధ్య పరస్పర గౌరవం, నిశ్శబ్ద అవగాహన, నిష్కల్మష ప్రేమ ఉన్నంత కాలం ఆ బంధం జీవించే ఉంటుంది.ఇకపై ఎవరైనా మేము విడిపోయాం, బంధం తెగిపోయింది అని ప్రకటించినప్పుడు ఒక్క క్షణం ఆలోచించండి. నిజంగా ఆ బంధం సమాప్తమైందా? లేక జ్ఞాపకంగా, పాఠంగా, జీవితానుభవంగా రూపాంతరం చెంది గుండె లోతుల్లో కొత్త లయతో కొనసాగుతోందా?




డా .సూర్యదేవర రామకృష్ణ ,

9490754169


**కాలనుగుణంగా నడుచుకోవడం..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవిడం పాలకుల కర్తవ్యం. శ్రీరాముడంతటి వాడు ప్రజల మనసెరిగి పాలన చేశారు. పూర్వం రాజులంతా అలాగే నడుచుకునే వారు. అలాకాకుండా పీడించిన వారు చరిత్రలో కనుమరుగయ్యారు. నిరంకుశంగా పాలించిన వారు సైతం చరిత్ర లేకుండా పోయారు. భారతదేశంలో అనేకానేక సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. వాటిని పట్టించుకోవడం మానేసిన అధికార, విపక్ష సభ్యులు తమ మానాన తాము సాగుతున్నారు.**

# డీ లిమిటేషన్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు!

ఈ మధ్యకాలంలో పార్లమెంట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవీ పెద్దగా చర్చించడం లేదు. పాలకులు అనుకున్నది మాత్రమే చట్టంగా మారుతోంది. దానిపైనా చర్చలు లేవు. విపక్షాలు కూడా గందరగోళం సృష్టించి బయపటడడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నీరుగారి పోయాయి. ఎవరి పట్టు వారు పట్టడంతో రోజూ సభలను వాయిదా వేయడం మినహా ముందుకు కదలడం లేదు. జంతర్‌మంతర్ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు. మరో వైపు పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జ్‌తో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. అందుకే జార్ఖండ్‌పై జవాబ్‌దో అంటూ ఎదురుదాడికి దిగారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును పత్రికలు, ఛానళ్లు కవర్ చేస్తూ...తమవంతు బాధ్యతను నిర్వహి స్తున్నాయి. నిజానికి వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా మోడీ వ్యూహం సిద్దం చేసుకున్నారని అంతా భావించారు. నిజానికి ఈ బిల్లులను



ఆమోదింపచేసేందుకు నరేంద్రమోదీ బృందం రంగం సిద్ధం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెట్టించిన ఉత్సాహంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్దవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఎన్‌డిఎ మద్దతుదారులంతా భావించారు. కానీ ఇలా తలకిందులు అవుతుదంని వారు కూడా భావించి ఉండరు. బహుశా మోడీ కూడా ఇలా జరుగుతుందని ఊహించి ఉండరు. అంతా తాను అనుకున్నట్లుగా సజావుగా సాగిపోతుందని అనుకుని ఉంటారు. నిజానికి పార్లమెంట్ ప్రారంభం రోజే మోడీ సభకు హాజరై ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కాక్రోచ్ పార్టీ ఉద్యమంతో అంతా తలకిందులయ్యింది. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం వంటివన్నీ మోదీ నాయకత్వాన్ని నిలదీస్తూ వచ్చాయి. ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం కూడా ఓ రకంగా ఎదురుదెబ్బగానే భావించాలి. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. ఇప్పుడు దాని ప్రభావంతోనే జార్ఖండ్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే దీనివెనక ఎవరి హస్తం ఉందన్న ఆరా తీస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పాలకులు ప్రజల మనసెరిగి ప్రవర్తించాలి. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సాగాలి. ఇప్పటికైనా విద్యార్థుల ఆందోళనలను సానుకూల దృక్పంథంతో పరిశీలిస్తే, సమస్యను పరిష్కరిస్తే మంచిది. ఇదొక్కటే కాదు.. అనేక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. నిరుద్యోగం, వైద్యరంగం, అధిక ధరలు, వంటివాటిని యుద్ధప్రాతిపదిక పరిష్కరించాలి. డీ లిమిటేషన్ ప్రజలకు అవసరం లేని వ్యవహారం. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినదే కనుక దీనిని పక్కన పెట్టడం మంచిది. మహిళా బిల్లును ప్రస్తు పార్లమెంట్ సభ్యుల సంఖ్యకే పరిమితం చేయడం మంచిది. ఎంపిలు పెరిగితే ఆర్థిక భారం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఈ దిశగా కృషి చేయకుంటే మోడీ సర్కార్‌కు కష్టాలు తప్పవు. దేశలో పెరుగుతన్న నిరుద్యోగ సమస్యలతో పాటు, అధిక ధరలు, దోపిడీలు, సైబర్ మోసాలు వంటివన్నీ పరిస్కరించదగ్గ సమస్యలే. కనుక వీటిపై మోడీ సర్కార్ దృష్టి సారిస్తే ప్రజలు ఆదరిస్తారు.

# సీతారాం ఏచూరి స్ఫూర్తితో యువత నడవాలి

## సీతారాం ఏచూరి స్ఫూర్తితో విద్యా కాషాయకరణకి వ్యతిరేకంగా పోరాడుదాం

## నలంద డిగ్రీ కళాశాలలో కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమం





**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఆగష్టు 12(క్రైమ్ మిర్రర్):** కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలు, విద్యార్థి ఉద్యమానికి ఆయన చేసిన సేవలు నేటి యువతకు మార్గదర్శకమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకురాలు మేడబోయిన మమత అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా నలంద డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకురాలు మేడబోయిన మమత హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడబోయిన మమత మాట్లాడుతూ, సీతారాం ఏచూరి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, విద్యార్థి ఉద్యమం నుంచి ఎదిగి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడని అన్నారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన ఆయన విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ అఖిల భారత స్థాయిలో విద్యార్థి ఉద్యమానికి బలమైన నాయకత్వాన్ని అందించారని తెలిపారు. 1984 నుంచి 1986 వరకు ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేసి విద్యార్థి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. విద్యార్థుల సమస్యలను కేవలం కళాశాల గేట్ల వరకు పరిమితం చేయకుండా, వాటిని దేశ రాజకీయాలు, సామాజిక వ్యవస్థతో అనుసంధానం చేసి చూడాలని సీతారాం ఏచూరి చూపించిన మార్గాన్ని యువత అనుసరించాలని మమత పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి పార్లమెంటులో ఉన్న సమయంలో విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల సమస్యలపై నిరంతరం తన గళాన్ని వినిపించారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఘటన సందర్భంగా విద్యార్థుల హక్కులు, విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి, విద్యార్థులపై జరుగుతున్న అణచివేత వంటి అంశాలపై ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారని గుర్తుచేశారు. విద్య అనేది వ్యాపార వస్తువు కాదని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని సీతారాం ఏచూరి తన రచనలు, ప్రసంగాల ద్వారా స్పష్టం చేశారని అన్నారు. విద్యా విధానాలపై ఆయన చేసిన విశ్లేషణల్లో విద్య ఎవరి ప్రయోజనాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటుందనే ప్రశ్నను ముందుకు తెచ్చారని తెలిపారు. సీతారాం ఏచూరి రాజ్యసభలో కూడా ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావించిన పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని, 2005 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారని, 2017లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి, అన్యాయాన్ని ఎదిరించాలి, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి, కులం--మతం పేరుతో జరిగే విభజనలను తిరస్కరించాలి, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విలువలను కాపాడాలి --- ఇదే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని మమత అన్నారు. ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి జీవితం విద్యార్థి ఉద్యమానికి ఒక పాఠశాల వంటిదన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడటంతో పాటు దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పరిరక్షించేందుకు ఆయన జీవితాంతం పోరాడారని అన్నారు. నేటి యువత సోషల్ మీడియా పరిధికే పరిమితం కాకుండా సమాజంలోని సమస్యలను అధ్యయనం చేసి, విద్యార్థుల హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఫీజుల భారాన్ని తగ్గించడం, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు--ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయించడం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థులకు భద్రమైన విద్యా వాతావరణం కల్పించడం వంటి సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సీతారాం ఏచూరి మరణం భారత వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక ఉద్యమాలకు తీరని లోటని, ఆయన చూపిన మార్గంలో విద్యార్థులు, యువత ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు అన్నారు. "ప్రశ్నించే విద్యార్థి... పోరాడే విద్యార్థి... సమాజాన్ని మార్చే శక్తి." "కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం విద్యార్థి యువత ముందుకు సాగాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సృజన మండల నాయకులు మల్లేష్, అరవింద్, ఆకాష్, మోనోర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## శివసాయి వెంచర్‌లో 10% భూమిని పరిరక్షించాలి




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివసాయి వెంచర్‌లో 10 శాతం భూమిని గుర్తించి పరిరక్షించాలని కోరుతూ యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గురులింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి ప్రవీణ్, మద్ది మధు మాట్లాడుతూ.. వెంచర్‌లో 10 శాతం భూమి ఎక్కడ ఉందో స్పష్టత ఇవ్వాలని, ఉంటే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వార్డు అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భూమిపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి శ్రీను, బొడ్డుపల్లి ఉపేందర్, సిలివేరు రిశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్పేట్ సర్కిల్ లో మాస్టర్ ప్లాన్ కు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై బడంగ్పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కోరారు. భవిష్యత్తులో ప్రజా రవాణా సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ మరియు భవిష్యత్తులో రోడ్ విస్తరణ అవసరాల దృష్టిలో నిర్దేశించిన మాస్టర్ ప్లాన్ కు విరుద్ధంగా మీర్పేట్ లో జరుగుతున్న నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కోరారు.



## సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి జీఎం ఘన సన్మానం

**మందమర్రి, ఆగస్టు 12 క్రైమ్ మిర్రర్):** సింగరేణి సామాగ్రిని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సకాలంలో గుర్తించి పట్టుకున్న మందమర్రి ఏరియా సెక్యూరిటీ సిబ్బందిని ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ అభినందించారు. బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందిని శాలువాలు, బహుమతులతో సత్కరించారు. బెల్లంపల్లి నుంచి సింగరేణి సామాగ్రిని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి గుర్తించారని జీఎం తెలిపారు. కె.శ్రీనివాసరావు (ఇంటెలిజెన్స్ గార్డు), సంజయ్‌కుమార్ దాస్ (జూనియర్ ఇన్‌స్పెక్టర్), సాగ శ్రీనివాస్ (మురళి మెయిన్ పవర్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు) విధుల్లో చూపిన అప్రమత్తత, నిబద్ధత అభినందనీయమన్నారు. సంస్థ ఆస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ దొంగలపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏరియాలోని మరిన్ని ప్రాంతాల్లో భద్రతా చర్యలను పటిష్ఠం చేసి సింగరేణి సొత్తును కాపాడాలని సూచించారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డిని కూడా జీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జి.ఎల్.ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్.అశోక్, సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బ్యాతోల్ లో విచ్చలవిడిగా ఇసుక, బండరాళ్ల తవ్వకాలు




**బ్లాస్టింగ్‌లతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు..**

**అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 12: బ్యాతోల్ గ్రామంలో ఇసుకను అక్రమంగా తవ్వి జేసీబీల ద్వారా తరలించడంతో పాటు బండరాళ్లను భారీగా బ్లాస్టింగ్ చేస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఆరోపించారు. బండరాళ్ల బ్లాస్టింగ్‌తో పెద్ద శబ్దాలు, దుమ్ము, రాళ్లు ఎగిరిపడే ప్రమాదం ఏర్పడి రహదారిపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగే విధంగా బ్లాస్టింగ్‌లు నిర్వహించడం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, బండరాళ్ల తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి బ్యాతోల్ గ్రామంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, బండరాళ్ల బ్లాస్టింగ్, అక్రమ రవాణాపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. రహదారి సమీపంలో జరుగుతున్న బ్లాస్టింగ్‌లను తక్షణమే పరిశీలించి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ఆస్పత్రి పనుల్లో నాణ్యత పాటించాలి : డిఎంహెచ్ఓ రాహుల్

### మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ





**మునుగోడు క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ రకాల మరమ్మతు పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి అందుతున్న వైద్య సేవలు, రోగుల వివరాలు మరియు మరమ్మతు పనుల పురోగతిపై ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నర్మదను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడూతూ... ఆస్పత్రిలో చేపడుతున్న మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టర్లు, సిబ్బందిని ఆదేశించారు. నిర్మాణ మరియు మరమ్మతు పనుల వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులకు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నర్మదతో పాటు ఇతర వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి

## గుండె చికిత్సకు రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు

## హర్షం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



**వనపర్తి ఆగస్టు 12 క్రైమ్ మిర్రర్:** గుండె సంబంధిత అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమ్మరి గుణగంటి స్వామి తండ్రి పెంటయ్య కు వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల ఎల్ఓసీ చెక్కును ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంజూరు చేయించారు. గుణగంటి స్వామి. గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని కౌన్సిలర్. బొడ్డుపల్లి పరశురాం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ప్రభుత్వ పరంగా రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని సందర్శించిన 13 వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి పరశురాం, బొడ్డుపల్లి రవి, గుణగంటి లక్ష్మీనారాయణ, గుణగంటి లోకేష్, నాగపూర్ అంజి తదితరులు పెంటయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు.

# ఎల్‌బీ నగర్‌లో ఏ ఆర్ కానిస్టేబుల్ సాయి కుమార్ మృతి..

# కుటుంబ సభ్యుల అనుమానాలు

## మృతదేహం తరలింపు, సి సి టి వి పనిచేయకపోవడం, మొబైల్ అప్పగింతపై ప్రశ్నలు

## క్రైమ్ నం. 1073/2026 । సెక్షన్ 194 బి ఎన్ ఎస్ ఎస్ కింద కేసు నమోదు

క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, ఆగస్టు 12:ఎల్‌బీ నగర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి కలకలం రేపింది. ఏ సి పి కార్యాలయం, ఎల్‌బీ నగర్‌లో 25 ఏళ్ల ఏ ఆర్ కానిస్టేబుల్ జె. సాయి కుమార్ మృతి చెందడం, అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించిన తీరుపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సి హెచ్ గంగాధర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. మంచాల్ మండలం అజ్జిన తండాకు చెందిన జర్పుల బోధ్య (55), తన కుమారుడు సాయి కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సాయి కుమార్‌కు అన్నగా జె. శేవల్ (27) ఏ ఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.



### అర్ధరాత్రి ఫోన్‌తో కుటుంబంలో కలకలం

ఫిర్యాదు ప్రకారం, ఆగస్టు 12న తెల్లవారుజామున సుమారు 3:30 గంటలకు జె. శేవల్ తన తండ్రికి ఫోన్ చేసి, తన తమ్ముడు సాయి కుమార్ ఏ సి పి కార్యాలయం, ఎల్‌బీ నగర్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎల్‌బీ నగర్ వైపు బయలుదేరారు. ఇదిలా ఉండగా, శ్రవణ్ అనే డ్రైవర్, న్ఎస్ ఓ (నైట్) ఏ ఆర్ కానిస్టేబుల్ అశోక్ ఫోన్ ద్వారా సంఘటన గురించి సమాచారం అందించడంతో శేవల్ వెంటనే కామినేని ఆసుపత్రికి చేరుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ తన తమ్ముడు మృతి చెంది ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు వచ్చేలోపే మృతదేహం తరలింపు?ఎి ఎం ల్ సి నివేదికకు సంబంధించి శేవల్ సంతకం తీసుకున్న అనంతరం, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించాలని సిబ్బంది సూచించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తమ కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకునే వరకు సుమారు 30 నిమిషాలు వేచి ఉండాలని శేవల్ కోరినప్పటికీ, మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ పరిణామం తమలో మరిన్ని అనుమానాలకు దారితీసిందని మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.

### మూడు అంశాలపై కుటుంబ సభ్యుల అనుమానాలు

సాయి కుమార్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ప్రధానంగా మూడు అంశాలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు.

1.కుటుంబ సభ్యులు వచ్చేలోపే మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించడం.

2.సాయి కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్న గదిలో సి సి టి వి కెమెరాలు పనిచేయకపోవడం.

3.మృతుడి మొబైల్ ఫోన్‌ను కుటుంబ సభ్యులు కోరినప్పటికీ సుమారు నాలుగు గంటల తర్వాత అప్పగించారని ఆరోపించడం. ఈ అంశాలన్నింటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

### సెక్షన్ 194 బి ఎన్ ఎస్ ఎస్ కింద కేసు నమోదు

ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు క్రైమ్ నం. 1073/2026, సెక్షన్ 194 బీ న్ ఎస్ ఎస్ కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులు, సి సి టి వి ఫుటేజీ, మృతుడి మొబైల్ ఫోన్, ఆసుపత్రి మరియు పోస్టుమార్టం సంబంధిత వివరాలతో పాటు సంఘటనకు ముందు, తరువాత జరిగిన పరిణామాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ?



# సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి జీఎం అభినందనలు

**మందమర్రి టౌన్ ఆగస్టు 12 క్రైమ్ మిర్రర్:** మందమర్రి జిఎం ఆఫీస్ ప్రాంతంలో బెల్లంపల్లి నుంచి అక్రమంగా సింగరేణి సామాగ్రిని తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి పట్టుకున్న ఇంటెలిజెన్స్ గార్డ్ కె. శ్రీనివాసరావు ,జూనియర్ ఇన్ స్పెక్టర్ సంజయ్ కుమార్ దాస్ , ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ సాగ శ్రీనివాస్ సెక్యూరిటీ సిబ్బందిని బుధవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎన్.రాధాకృష్ణ శాలువతో సత్కరించి బహుమతులతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, సింగరేణి సొత్తును కాపాడటం అభినందనీయమని అన్నారు వారి పనితనాన్ని, నిబద్ధతను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.ఏ పరిస్థితుల్లోనూ సంస్థ ఆస్తి దొంగల పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భద్రతను మరిన్ని ప్రాంతాల్లో పటిష్టం చేస్తూ సింగరేణిని సొత్తును కాపాడుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీఎం సూపరింటెండింగ్ ఆఫీసర్ ఎస్ఓటు జిఎం జి ఎల్. ప్రసాద్, డిజిఎం పర్సనల్ సిహెచ్. అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

## ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి

## తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపడుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీలలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ పతాకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడంతో పాటు, జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి కుటుంబం జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, ఎల్.వి. రెడ్డి, నరసింహారెడ్డి, మన్మోహన్ రెడ్డి, రాజ్ కుమార్, బొల్లా రామకృష్ణ, నర్సిరెడ్డి, పాండురంగ రెడ్డి, అడికే శివశంకర్, గోవర్ధన్ రెడ్డి, భాస్కర్, చందు నాయక్, అభి, శివ, తలారి చిన్న, మధుసూదన్ రెడ్డి, సురేష్, రవి, భూపతి-ఒడ్డి, శశిధర్ రెడ్డితో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనం గా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ

గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వ విద్యాలయం నాలెడ్జ్ మేనేజ్ మెంట్ సెంటర్ లో జాతీయ గ్రంధ పాలకుల దినోత్సవం ఘనం గా జరిగింది. దేశంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడైన డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని భారతదేశంలో ఆగస్టు 12న జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భం గా డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్ర పటానికి విశ్వ విద్యాలయ డీన్ ఆఫ్ పీ జీ స్టడీస్ డాక్టర్ కే బీ ఈశ్వరి,విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం.యాకాద్రి, విశ్వవిద్యాలయం గ్రంధ పాలకులు డాక్టర్ రవి కుమార్ లు పుష్పాంజలి ఘటించారు.దేశం లో గ్రంధాలయ శాస్త్ర అభివృద్ధి కి అయన చేసిన సేవలని కొనియాడారు. విద్యార్థులు,అధ్యాపకుల జీవితాల్లో గ్రంధాలయాలు పోషించే కీలక పాత్ర గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో జాయింట్ రిజిస్ట్రార్ శివాజీ,నాలెడ్జ్ మేనేజ్ మెంట్ సెంటర్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



# కల్వకుర్తి అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి కీలక ప్రతిపాదనలు..

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీలకు రూ.80 కోట్లు..

## అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి..



**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ):** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయడంతో పాటు పేద కుటుంబాలకు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ గౌరవ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### మున్సిపాలిటీలకు రూ.80 కోట్ల నిధులు

ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీలలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) తదితర మౌలిక వసతుల అభివృద్ధి కోసం మొత్తం రూ.80 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

### ఆమనగల్ మున్సిపాలిటీకి రూ.30 కోట్లు

కల్వకుర్తి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు కేటాయించి పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రతిపాదించారు.


### పేదల కోసం అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు

కల్వకుర్తి నియోజకవర్గంలో పేద కుటుంబాలు అధికంగా ఉన్న నేపథ్యంలో అర్హులైన నిరుపేదలకు మరింత ప్రయోజనం చేకూర్చేలా అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కోరారు. గృహ అవసరం అధికంగా ఉన్న కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని అదనపు ఇళ్లను మంజూరు చేస్తే మరిన్ని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయవచ్చని ఎమ్మెల్యే వివరించారు. గ్రామపంచాయతీలకు యూజీడీ కోసం రూ.50 కోట్లు అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, గ్రామపంచాయతీలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### ప్రతిపాదనలపై సీఎం సానుకూల స్పందన

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమర్పించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా చౌడేశ్వరి మాత జన్మదినోత్సవ వేడుకలు



**వనపర్తి ఆగస్టు 12 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు శ్రీ కృష్ణ యాదవ సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి చంద్రయ్య, అర్చకులు గోపి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతి సమర్పించారు. తొగుట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి ఉదయం. అభిషేకం. అలంకరించి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ ప్రాంగణంలో భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. డోలు వాయిద్యాల నడుమ సిగసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం, యువజన సంఘాల సభ్యులు తొగుట వీర క్షత్రియ. ఆలయ కమిటీ సభ్యులు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి జయంతి ఉత్సవాలను విజయవంతం చేశారు



# ఘనంగా కాటేదాన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ జన్మదిన వేడుకలు

## భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ జన్మదిన వేడుకలు బాబుల్ రెడ్డి నగర్‌లోని ఆయన నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల లైట్లు, ఎల్ఈడీ స్క్రీన్లతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకటేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి వెంకటేష్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, మిఠాయి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



అంతకుముందు వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనగర్ కాలనీలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేష్ ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ నిజమైన సేవాభావంతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఆయన దూరదృష్టి, పట్టుదల, నిజాయితీతో కూడిన నాయకత్వం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తోందని అన్నారు. వెంకటేష్ భవిష్యత్తులో మరింత విజయవంతంగా, ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఆయన సేవా స్ఫూర్తి మరింత శక్తివంతంగా కొనసాగాలని, ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని కోరారు. ఈ జన్మదిన వేడుకల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్. వెంకటేష్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

---

# దేశభక్తి నినాదాలతో మార్మోగిన జగద్గిరిగుట్ట

## జాతీయ జెండాలతో దేశభక్తి చాటిన విద్యార్థులు

## హర్ ఘర్ తిరంగా పేరిట బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**కూకట్ పల్లి, ఆగస్టు 12 (క్రైమ్ మిర్రర్) :** దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్టలో భారీ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు 2,000 మంది విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీనివాస్‌నగర్‌లోని నవోదయ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ చైతన్య పాఠశాల మీదుగా జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వరకు కొనసాగింది. విద్యార్థులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ముందుకు సాగడంతో మార్గమంతా జాతీయ స్ఫూర్తితో సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**జాతీయ జెండాలతో దేశభక్తి చాటిన విద్యార్థులు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడంతో పాటు దేశభక్తి, జాతీయ ఐక్యత, దేశం పట్ల గౌరవ భావనను ప్రజల్లో మరింతగా పెంపొందించాలనే సందేశాన్ని ప్రజలకు అందించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు,




నాయకులు, కార్యకర్తలు చేతుల్లో త్రివర్ణ పతాకాలను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా నినాదాలు చేశారు.

**ముఖ్య అతిథులుగా పలువురు బీజేపీ నేతలు**

ఈ భారీ ర్యాలీకి ముఖ్య అతిథులుగా ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు అన్నద గౌడ్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, నందం దివాకర్ తదితరులు హాజరయ్యారు. వారు ర్యాలీలో పాల్గొని విద్యార్థులు, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా దేశ గౌరవానికి, ప్రజల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని



పిలుపునిచ్చారు.

**భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు**

ఈ కార్యక్రమంలో విగ్నేష్ చారి, వాసు, సుధ, భరత్ సింహారెడ్డి, సురేష్ రెడ్డి, సిద్ధిరాం రెడ్డి తదితరులతో పాటు ఓబీసీ మోర్చా నాయకులు సతీష్ గౌడ్, విద్యాసాగర్, రమేష్, రవి యాదవ్, రమేష్ యాదవ్, రంగ శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, నాగరాజు యాదవ్, కుమార్ యాదవ్, మార్చాల శ్రీనివాస్,యువ నాయకులు ఆర్థిక యాదవ్ ,మహిళా నాయకులు వసుంధర, రేణుక, తేజస్విని, సబిత, సంధ్య తదితరులు కూడా ర్యాలీలో పాల్గొని జాతీయ జెండాలను ప్రదర్శించారు. సుమారు 2,000 మంది ఒకే వేదికపై త్రివర్ణ పతాకాలతో కదలడంతో జగద్గిరిగుట్ట పరిసరాలు దేశభక్తి నినాదాలతో మార్మోగాయి. దీంతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 12(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ( డిసిపియు),"స్కోప్" ( ఎన్జీవో) సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ ..బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కులు పరిరక్షణ, 1098, 112, తదితర టోల్ ఫ్రీ నెంబర్ల గురించి బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. పోక్స్ చట్టం గురించి,సైబర్ నేరాలు, డ్రగ్స్ గురించి, గుడ్ టచ్, బాడ్ టచ్, మానసిక , శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన పద్ధతులు మెలకువలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం విద్యార్థినీల చేత బాల్య వివాహాల నిర్మూలన కొరకు ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్స్ లాంచింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి , స్కోప్ సంస్థ ప్రతినిధి బి.నరసింహ రాజు ,పాఠశాల ఉపాధ్యాబృందం, పాఠశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడ గుట్ట ఆలయంలో ఘనంగా అమావాస్య పూజలు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 12:** బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించడంతో పాటు ఆలయ ప్రాంగణంలో మృత్యుంజయ హోమాన్ని ఘనంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం భక్తుడు మణికంఠ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్, వారి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో దేవానాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజున ఆలయ ప్రాంగణంలో మృత్యుంజయ హోమం, ప్రతి పౌర్ణమి రోజున మహా చండీ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొనదలచిన భక్తులు ముందురోజు ఆలయ అధికారులు, అర్చకులు లేదా దేవాలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం పూజా కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, బండరాళ్ల బ్లాస్టింగ్, అక్రమ రవాణాపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. రహదారి సమీపంలో జరుగుతున్న బ్లాస్టింగ్‌లను తక్షణమే పరిశీలించి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తితో పాటు యువతలో సామాజిక బాధ్యత పెరగాలి

### పటాన్చెరులో ఘనంగా తిరంగా యాత్ర..

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 12: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత శక్తిని సక్రమమైన మార్గంలో వినియోగించినప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరు మైత్రి మైదానంలో నిర్వహించిన తిరంగా యాత్రను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. దేశభక్తి నినాదాలతో పటాన్చెరు వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువత రాణించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల



వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

**స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై సమీక్ష**

రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పటాన్చెరు మైత్రి మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమై వేడుకల నిర్వహణపై చర్చించారు. ప్రతి ఏడాది మాదిరిగానే సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ఫాస్ట్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వేడుకల్లో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి పాఠశాలకు రూ.5 వేల నగదు బహుమతి



ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. దేశ స్వాతంత్ర్య ఘట్టాలను, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## మోహన్ నగర్ లో అమావాస్య అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న నాయకోటి పవన్ కుమార్

క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,ఆగస్ట్ 12; శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో మోహన్ నగర్ చౌరస్తాలో బీజేపీ జిల్లా నాయకులు ఉపేందర్ సింగ్ ఠాగూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు, ప్రజలకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు.అదేవిధంగా కమర్షియల్ ట్యాక్స్ కాలనీ కమాన్ వద్ద మైసమ్మ దేవాలయం సమీపంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు ఊరెల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలోనూ పవన్ కుమార్ పాల్గొని ప్రజలకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని పేర్కొన్నారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని అన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందిస్తూ, సమాజంలోని ప్రతి ఒక్కరికీ తోడ్పాటు అందించేలా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.

## కాటేదాన్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కాటేదాన్ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. దేశభక్తి, జాతీయ ఐక్యత, గౌరవానికి ప్రతీకగా నిలిచే హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, సంతోష్ గౌడ్, రావుల భాస్కర్, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నావర్ మురళీధర్ రెడ్డి, వెంకటరమణ, రమేష్ రెడ్డి, రాజు స్వామి, బొమ్మరాజు నర్సింహా, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై బీజేపీ కార్యకర్తల సమావేశం

### ఆగస్టు 14న మణికొండలో తిరంగా ర్యాలీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్, నెక్నాంపూర్ డివిజన్‌లకు చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ప్రతి కార్యకర్త తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను, దేశ రక్షణలో సేవలందిస్తున్న సైనికులను స్మరించుకోవాలని కోరారు. అలాగే ఆగస్టు 14న ఉదయం 11 గంటలకు మణికొండ ఆంధ్రా బ్యాంక్ సర్కిల్ నుంచి మర్రిచెట్టు వరకు, అక్కడి నుంచి తిరిగి ఆంధ్రా బ్యాంక్ సర్కిల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీలో పార్టీ కార్యకర్తలు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మణికొండ, నెక్నాంపూర్ డివిజన్‌లకు చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు





# రాజేంద్రనగర్‌లో ఘనంగా మహా ప్రసాదం పంపిణీ

### భక్తులకు ఓడిబియ్యంతో ప్రసాదం అందజేత

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్‌లోని శ్రీశ్రీశ్రీ ఈదమ్మ, శ్రీశ్రీశ్రీ భూలక్ష్మమ్మ దేవాలయంలో బోనాల పండుగ సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన ఓడిబియ్యంతో మహా ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన ఓడిబియ్యాన్ని ఆలయ నిర్వాహకులు ప్రత్యేకంగా వండి, బుధవారం ఉదయం భక్తులకు మహా ప్రసాదంగా అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్, గోల్కొండ–గోషామహల్ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్, జిల్లా ఇన్‌చార్జ్ వై. శ్రీధర్, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మహేందర్, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి స్వర్ణలత రెడ్డి, వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ బొక్క బాల్ రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర నాయకుడు బాత్కు శ్రీనుతో పాటు సందీప్ కుమార్, బాబురావు, ఇ. వేణుగోపాల్, అరుణ్, ఎస్. వెంకటేష్, కె. శ్రీధర్, ఎం. శ్రీనివాస్, వై. గోపాల్, నర్సింహ, జి. రాములు, వై. రామకృష్ణ, కె. నాగేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన మహా ప్రసాదం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ట్రాఫిక్ నేరాలపై ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు

### 8 కేసుల పరిష్కారం.. ఇద్దరికి జైలు శిక్ష, మొత్తం రూ.20 వేల జరిమానా



గండిపేట(క్రైమ్ మిర్రర్): ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మొత్తం 8 ట్రాఫిక్ కేసులను పరిష్కరించి, రూ.20,000 జరిమానా విధించినట్లు శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కు పాల్పడిన ఇద్దరిని రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఎదుట హాజరుపరచగా, వారికి ఒక్కొక్కరికి ఒకరోజు సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.2,500 చొప్పున జరిమానా విధించారు. వీరిలో రాగిరి శివ రాములు, బి. సుగ్రీవులు ఉన్నారు. మిగిలిన ఆరుగురిపై డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి, వారికి కలిపి రూ.15,000 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో మొత్తం 8 కేసుల్లో రూ.20,000 జరిమానా వసూలైంది. రోడ్డు భద్రతను పెంపొందించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# అమావాస్య రోజు అన్నదానం మహా శ్రేష్టం

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) : అమావాస్య రోజు అన్నదానం మహా శ్రేష్టం అని శ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థాన కమిటీ ఛైర్మెన్ తెరిటిపల్లి శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం వాసవీ మాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం చేపట్టిన అనంతరం ఆలయ ట్రస్టీలు, సభ్యుల సలహాల మేరకు సుమారు నాలుగు సంవత్సరాల నుండి ప్రతి అమావాస్య నాడు భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు వెయ్యి మంది భక్తులు అన్నదానంలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ శ్రీరామ చంద్ర మూర్తి, మేనేజింగ్ ట్రస్టీలు, టెంపుల్ డైరెక్టర్లు, ఆలయ నిర్మాణ దాతలు ఆర్యవైశ్య నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



## వడ్డేపల్లి చౌరస్తాలో టిఫిన్ సెంటర్‌పై

# స్థానికుల ఫిర్యాదులు

- రోడ్డుపై వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు..
- మురుగునీటితో దుర్వాసన
- నాణ్యత లేని సరుకులు, నూనెను ఉపయోగించి టిఫిన్ల తయారి
- మురికి నీటి వల్ల దోమలు ఈగలు తీనుబండారాలపై వాలి వ్యాధులు సోకే ప్రమాదం
- ఎవరైనా మురుగునీటిని రోడ్లపైకి వదిలినా, చెత్త వేసినా జరిమానా తప్పదు
- చింతల్ చెరు గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మ హెచ్చరిక





హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 12: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పరిధిలోని వడ్డేపల్లి చౌరస్తాలో బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న ఓ టిఫిన్ సెంటర్‌పై స్థానికులు, వినియోగదారులు పలు ఆరోపణలు చేస్తున్నారు. హోటల్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అదేవిధంగా హోటల్ యజమాని మద్యం సేవించి కౌంటర్‌లో కూర్చొని వినియోగదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. తాజాగా ఓ వినియోగదారుడు ఇడ్లీ వేడిగా ఉందా అని అడిగినందుకు యజమాని తనపై దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో మాట్లాడాడని మీడియాకు తెలిపాడు. హోటల్‌లో నాణ్యత లేని సరుకులు, నూనెను ఉపయోగించి టిఫిన్లు తయారు చేస్తున్నారని, దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా హోటల్ నుంచి వెలువడే మురుగునీటిని రోడ్డుపక్కనే వదులుతున్నారని, దీంతో తీవ్ర దుర్వాసన వస్తోందని తెలిపారు. ఈ మురికి నీటి వల్ల దోమలు ఈగలు తీనుబండారాలపై వాలి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వినియోగదారుల ఆందోళన చెందుతున్నారు. బస్టాండ్‌లో వేచి ఉండే ప్రయాణికులు సైతం దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హోటల్ యజమాని గ్రామపంచాయతీకి పన్ను చెల్లిస్తున్నారా లేదా అనే అంశంపైనా అధికారులు విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. హోటల్‌లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, మురుగునీటి నిర్వహణ తదితర అంశాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**గ్రామపంచాయతీ కార్యదర్శి వివరణ**

హోటల్ నుంచి మురుగునీటిని రోడ్డుపక్కన వదలడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శురు ప్రతినిధి గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మను వివరణ కోరగా, హోటల్ యజమానిపై విచారణ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా మురుగునీటిని రోడ్లపైకి వదిలినా, చెత్త వేసినా జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు.

# అనధికార లోతైన తవ్వకాలతో ఇళ్లకు ముప్పు

### నిర్మాణ భద్రతపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు





గండిపేట(క్రైమ్ మిర్రర్): నార్సింగి సర్కిల్ పరిధిలోని గో గ్రీన్ కాలనీలో అనధికారికంగా చేపడుతున్న లోతైన తవ్వకాల కారణంగా పక్కనే ఉన్న తమ ఇంటి నిర్మాణానికి ప్రమాదం పొంచి ఉందని ఓ స్థానికుడు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తవ్వకాలను పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. గో గ్రీన్ కాలనీలోని ప్లాట్ నంబర్లు 60, 61, సర్వే నంబర్లు 100, 109లో తమ నివాస స్థలానికి ఆనుకుని భారీగా లోతైన తవ్వకాలు చేపడుతున్నారని, తగిన షోరింగ్, రిటైనింగ్ సపోర్ట్, బారికేడ్లు, వర్షపు నీటి మళ్లింపు, డీవాటరింగ్ వంటి భద్రతా ఏర్పాట్లు చేయలేదని ప్లాట్ నంబర్ 62కు చెందిన ఆర్. వినయ్ బాబు నార్సింగి సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా తవ్విన ప్రాంతంలో భారీగా నీరు నిలిచిపోవడంతో మట్టి కోతకు గురవుతూ, తమ ఇంటి పునాదికి ఆధారంగా ఉన్న మట్టిపై ప్రభావం పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం కనీస సెట్‌బ్యాక్ కూడా పాటించలేదని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు తక్షణ చర్యలు అవసరమని వినయ్ బాబు తెలిపారు. సంబంధిత అధికారులు అత్యవసరంగా స్థలాన్ని పరిశీలించి, మంజూరైన భవన ప్రణాళిక, తవ్వకాలకు అనుమతులు, తప్పనిసరి సెట్‌బ్యాక్ నిబంధనలను పరిశీలించాలని కోరారు. తవ్వకాల వల్ల మట్టి మరింత జారిపోవడం, నీరు నిలిచిపోవడం కొనసాగితే తమ ఇంటి నిర్మాణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరగకముందే అనధికారికంగా లేదా ప్రమాదకరంగా జరుగుతున్న పనులను నిలిపివేసి, తగిన నిర్మాణ భద్రతా చర్యలు చేపట్టేలా సంబంధిత యజమానికి ఆదేశాలు జారీ చేయాలని నార్సింగి సర్కిల్ అధికారులను ఆయన కోరారు.



# గండిపేట్ లో వైభవంగా రక్తమైసమ్మ అమ్మవారి బోనాలు



గండిపేట్,(క్రైమ్ మిర్రర్): రక్తమైసమ్మ అమ్మవారికి బోనం, వడిబియ్యం సమర్పించే పవిత్ర కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. వ్యవసాయ మార్కెట్ సంచాలకులు లక్ష్మీశ్రీ భక్తిశ్రద్ధలతో నివాసం నుంచి బోనం తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ హాజరయ్యారు. అలాగే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, మాజీ పురపాలక సంఘ సభ్యురాలు శైలజ, కాంగ్రెస్ నాయకులు కపిల్, సహాయ పోలీస్ కమిషనర్ శరత్, దేవేందర్ రెడ్డి, అశోక్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, మాజీ పురపాలక సంఘ సభ్యులు కిరణ్, వినోద్, మణికొండ మాజీ పురపాలక సంఘ సభ్యులు రామకృష్ణారెడ్డి, శ్రవణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందిన ప్రతి ఒక్కరికీ వ్యవసాయ మార్కెట్ సంచాలకులు లక్ష్మీశ్రీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారంతో

# గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్సీ నిరికంటి సత్యం

క్రైమ్ మిర్రర్, నాంపల్లి: అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్సీ నెలికంటి సత్యం అన్నారు.నాంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్తు, విద్య, వైద్యం తదితర ముఖ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణం, రహదారుల కోసం భూములు, ఇండ్లు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం అందిస్తే వారి అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచులు ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకునే విధంగా




చూడాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పూర్తి స్థాయిలో పారదర్శకత పాటించాలని అన్నారు. ఎంపీడీవో పీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ మండల అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయిలో వున్న అన్ని శాఖల అధికారులు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. సమావేశాలకు గైర్హాజరయ్యే జయ హాజరయ్యే అధికారుల వివరాలను ఉన్నతాధికార దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. ప్రభుత్వాన్ని నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలను సకాలంలో చెల్లించాలని సర్పంచులు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో పలువురు సర్పంచులు తమ గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# యూరియా కోసం రైతు కన్నీరు..!

## నాకు చిన్న ఫోన్ మాత్రమే ఉంది.. ఎవరైనా సాయం చేయండి

## అటెండర్ కాళ్లపై పడి రెండు బస్తాలు ఇప్పించాలని వేడుకోలు.. చలించిన తోటి రైతులు

మెదక్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 12: యూరియా కోసం వచ్చిన ఓ రైతు ఆవేదన రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఉన్న రైతులను కలచివేసింది. చిలిపిచేడు మండలం చిట్కుల గ్రామానికి చెందిన ఓ రైతు యూరియా కొనుగోలు చేసేందుకు రంగంపేట సొసైటీకి రాగా.. మొబైల్ ఫోన్ ద్వారా పూర్తి చేయాల్సిన ప్రక్రియపై అవగాహన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు.



**నాకు ఇద్దరు ఆడపిల్లలే.. తోడెవరూ లేరు**

యూరియా తీసుకునే విధానం తెలియక రైతు భావోద్వేగానికి గురయ్యాడు. తనకు ఇద్దరు ఆడపిల్లలు మాత్రమే ఉన్నారని, తనకు ఎవరూ తోడులేరని, తన వద్ద చిన్న ఫోన్ మాత్రమే ఉందని, యూరియా సంచులు తీసుకునేందుకు కొత్త విధానాలు తెలియడం లేదని చెబుతూ సాయం చేయాలని కంటతడి పెట్టుకున్నాడు.

**అటెండర్ కాళ్లపై పడి వేడుకోలు**

రైతు ఆవేదన మరింత కలచివేసేలా మారింది. సహకార సంఘం అటెండర్ బిక్షపతి కాళ్లపై పడిన రైతు.. ఒక్కో బస్తా రూ.900 చొప్పున రెండు బస్తాల యూరియా ఇప్పించాలని వేడుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు రైతులు తీవ్రంగా చలించిపోయారు.

**స్మార్ట్‌ఫోన్ లేని రైతుల పరిస్థితి ఏంటి..?**

ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విధానాలపై అవగాహన లేని, స్మార్ట్‌ఫోన్ సదుపాయం లేని రైతులు ఎరువులు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారని తోటి రైతులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులకు యూరియా అందేలా సొసైటీల వద్ద ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. పంటల సాగులో కీలక సమయంలో ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్‌ఫోన్, యాప్‌లపై ఆధారపడకుండా అర్హులైన ప్రతి రైతుకు యూరియా సులభంగా అందేలా పంపిణీ ప్రక్రియను సరళీకరించాలని కోరారు.

# దొంగతనం కేసుల్లో నిందితులకు మూడేళ్ల జైలు

## బ్యాటరీలు, ద్విచక్ర వాహనం చోరీ కేసుల్లో కోర్టు తీర్పు

## ఒక్కొక్కరికి ఐదు వందల రూపాయల జరిమానా.. చెల్లించకుంటే అదనంగా ఏడు రోజుల జైలు

## నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు-- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): దొంగతనాలకు పాల్పడే నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడిన వారికి న్యాయస్థానంలో శిక్ష పడేలా పోలీసులు నాణ్యమైన దర్యాప్తు చేపడుతున్నారని తెలిపారు. కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు వేర్వేరు దొంగతనం కేసుల్లో, నిందితులకు నల్లగొండలోని మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం, మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు వెల్లడించారు. కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాక్టర్ల బ్యాటరీల దొంగతనం, ద్విచక్ర వాహనం దొంగతనానికి సంబంధించి నమోదైన, కేసులను పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేశారు. కేసుల్లో నిందితులపై నేరాన్ని రుజువు చేసే ఆధారాలను, సేకరించి న్యాయస్థానంలో సమర్పించడంతో నిందితులకు శిక్ష పడింది. కనగల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మొదటి కేసులో నిందితులు సముద్రాల కృష్ణ, షేక్ టిప్పు సుల్తాన్లకు న్యాయస్థానం మూడేళ్ల సాధారణ జైలు శిక్ష విధించింది. దీంతో పాటు ఇద్దరికీ ఒక్కొక్కరికి ఐదు వందల రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో దొంగతనం కేసులో, నిందితుడు సముద్రాల కృష్ణకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష విధించారు. దీంతో పాటు ఐదు వందల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష



అనుభవించాల్సి ఉంటుంది. అయితే ఈ కేసులో మరో నిందితుడు షేక్ టిప్పు సుల్తాన్‌ను న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది.

**పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు**

ఈ రెండు కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు. కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అప్పటి కనగల్ ఎస్ఐ పి.విష్ణుమూర్తి, ప్రస్తుత ఎస్ఐ కె. రాజీవ్ రెడ్డి, సహాయ ప్రభుత్వ న్యాయవాది ఎన్. కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ పి. నరేందర్, పోలీసు కానిస్టేబుళ్లు వై. నాగేశ్, ఎన్. మల్లికార్జున్‌లను ఎస్పీ అభినందించారు. నిందితులకు శిక్ష పడేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం అభినందనీయమన్నారు.

**నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా**

నేరాల దర్యాప్తులో నాణ్యతను మరింత పెంచాలని, ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రతి కేసులో అందుబాటులో ఉన్న ఆధారాలను సమగ్రంగా సేకరించి, నేరస్తులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. దొంగతనాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని ఎస్పీ తెలిపారు. దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

**విలువైన వస్తువుల భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ప్రజలు కూడా తమ విలువైన వస్తువులు, వాహనాలు, ఇతర ఆస్తుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దొంగతనాల నియంత్రణలో పోలీసులతో పాటు, ప్రజల సహకారం కూడా ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరిస్తే దొంగతనాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. నేరం చేస్తే శిక్ష తప్పదు అనే సందేశాన్ని ఈ రెండు కేసుల తీర్పులు స్పష్టం చేస్తున్నాయని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.



# కాంట్రాక్ట్ కార్మికుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణను ఖండించిన సివిల్ కాంట్రాక్టర్లు

మందమర్రి టౌన్ ఆగస్టు 12 క్రైమ్ మిర్రర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల నుండి సివిల్ కాంట్రాక్టర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు సరైనవి కావని బుధవారం మందమర్రి విలేకరుల సమావేశంలో సివిల్ కాంట్రాక్టర్ల అధ్యక్షుడు బర్ల సదానందం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో తేదీన దేశవ్యాప్త జాతీయ సంఘాలు ఒక్క రోజు టోకెన్ సమ్మె చెయ్యగా వారికి మద్దతుగా సింగరేణి కార్మికులు సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు అని తెలిపారు. దానిలో భాగంగా కాంట్రాక్టర్లకు యూనియన్ నాయకులు నో వర్క్ నో పేమెంట్ సర్క్యులర్లను జారీ చేసి డబ్బులు రికవరీ కాకుండా యూనియన్ నాయకులు తీసుకొచ్చేవారని చెప్పారు. బిల్లులు లేట్ అయినప్పటికీ నెలకు రెండు నెలలకు ఆ అమౌంట్ రికవరీ అయ్యేదని ఫిబ్రవరిలో జరిగిన సమ్మెలో ఆరు నెలలు గడిచినప్పటికిని ఆ బిల్లు రికవరీ కాలేదని ఒక్కొక్క కాంట్రాక్టర్ కి 16 వేల రూపాయలు రికవరీ జరిగిందని ఆ రికవరీ కాంట్రాక్ట్ కార్మికుల నుండి 500 రూపాయల చొప్పున తీసుకోవాలని తెలిపారు. కానీ వారి నుండి మేము వేరే ఏ ఉద్దేశంతో గాని డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేయలేదని తెలియజేశారు. ఇప్పటికైనా యూనియన్ నాయకులు అధికారులు ఆ రికవరీ పేమెంట్ను కాంట్రాక్టర్లకు ఇప్పిచ్చినచో ఈ కాంట్రాక్ట్ కార్మికుల నుండి రికారీ మేము చేసే అవసరం మాకు ఉండదని యూనియన్ నాయకులు స్పందించి ఈ యొక్క రికవరీ అమౌంట్ ని మాకు ఇప్పించగలరని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, సాగర్ బాబు, కుమార్, కుంట్ల రవి, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో ఘనంగా రక్తదాన శిబిరం

## విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం



గండిపేట(క్రైమ్ మిర్రర్): మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అత్యంత గొప్ప సామాజిక బాధ్యత అని, ఒక యూనిట్ రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం కల్పిస్తుందని అన్నారు. యువత సామాజిక బాధ్యతతో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంజీఐటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అందించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గణిత, మానవీయ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ వి. హరిలీల, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి. బాల్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, లయన్స్ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించేలా భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

## పరిగి డిఎస్పి శ్రీనివాస్ సిఐ కొండల్ రెడ్డి కుల్కచర్ల ఎస్సై వి రమేష్ కుమార్

## సైబర్ క్రైమ్ జాగృతి దివాస్ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పరిగి డి.ఎస్.పి శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండల్ రెడ్డి, కుల్కచర్ల ఎస్సై వి రమేష్ కుమార్ వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం "సైబర్ క్రైమ్ జాగృత దివస్" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శ్రీ నర్సింలు గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 140 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కూడా కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు యువత సోషల్ మీడియా, ఆన్‌లైన్ యాప్స్, డిజిటల్ చెల్లింపుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రధానంగా చర్చించిన సైబర్ మోసాల పద్ధతుల బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, కస్టమర్ కేర్ సిబ్బంది పేరుతో ఫోన్ చేసి ఓటిపి యూపీఐ పిన్ వంటి రహస్య సమాచారాన్ని అడిగే వ్యక్తులను నమ్మవద్దని వారు సూచించారు. ఓటిపిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదు తెలిపారు.

**నకిలీ లోన్ ఆప్స్ వాడకూడదు**

తక్కువ సమయంలో తక్కువ వడికి రుణాలు ఇస్తామని



చెప్పే అనధికారిక రాఖీుల ాబాజూజూం లోన్ యాప్స్ ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని, కాంటాక్ట్స్‌ను సేకరించి వేధింపులకు పాల్పడే అవకాశముందని వివరించారు. గుర్తుతెలియని యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని, అధికారిక వనరుల నుంచే యాప్స్‌ను వినియోగించాలని సూచించారు.నకిలీ సోషల్ మీడియా అకౌంట్లు, లింకులు, మెసేజీలు, బహుమతులు, ఉద్యోగ అవకాశాలు లేదా పరిచయస్తుల పేరుతో వచ్చే సందేశాల ద్వారా వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు అలాగే బ్యాంకింగ్ వివరాలను దొంగిలించే అవకాశం ఉందని వివరించారు. తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు.పోలీస్,సిబిఐ,ఈడి కోర్టు లేదా ఇతర ప్రభుత్వ అధికారుల పేరుతో వీడియో కాల్ చేసి కేసులో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు బదిలీ చేయించే మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారతదేశంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసు అధికారులు ఎవరినీ ఆన్‌లైన్‌లో నిర్బంధించి డబ్బులు చెల్లించాలని ఆదేశించరని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో కనిపించే నకిలీ ఉద్యోగ ప్రకటనలు, పెట్టుబడి అవకాశాలు, బహుమతులు, డిస్కౌంట్లు ఇతర ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి ముందుగా డబ్బులు చెల్లించవద్దని సూచించారు. సంస్థ లేదా ప్రకటన నిజమైనదో కాదో ధృవీకరించిన తర్వాతే స్పందించాలని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ త్వరగా డబ్బు సంపాదించవచ్చని చెప్పే అనుమానాస్పద యాప్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఇటువంటి యాప్స్ ద్వారా ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం కూడా ఉందని వివరించారు.బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, కార్డు వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. డబ్బు స్వీకరించడానికి యూపీఐ పిన్ అవసరం లేదని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా డబ్బు వస్తుందని చెప్పే మోసగాళ్లను నమ్మవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 గురువారం 13-8-2026

# పాఠశాల గుమ్మం దాటిన విద్యా సంవత్సరం..

**విద్యార్థుల చేతుల్లోకి చేరని సర్కారు హామీలు**

**కొత్త విద్యా సంవత్సరం వచ్చేసింది.. పాత సమస్యలే మిగిలాయే!**

**యూనిఫామ్‌ల కోసం ఎదురుచూపులు.. 21 రకాల వస్తువుల కిట్‌పై నిశ్శబ్దం..**

**పంద్రాగస్టు వేడుకల వేళ తల్లిదండ్రుల్లో ఆందోళన**

తెలంగాణ(క్రైమ్ మిర్రర్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. విద్యార్థులపై తల్లిదండ్రుల ఆర్థిక భారం తగ్గించేందుకు, పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రకటిస్తోంది. కానీ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలయ్యే వేగంలో మాత్రం, లోటు కనిపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తవుతున్నా.. అనేక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కొత్త యూనిఫామ్‌లు, అందకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొత్త విద్యా సంవత్సరం అంటే విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం. కొత్త పుస్తకాలు.. కొత్త దుస్తులు.. కొత్త ఆశలు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రం, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా యూనిఫామ్ విషయంలో పాత పరిస్థితులే ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన 21 రకాల వస్తువులతో కూడిన, విద్యార్థి కిట్ ఎప్పుడు అందుతుందన్న దానిపై కూడా స్పష్టత లేకపోవడం ఆందోళనకు కారణమవుతోంది.

**నిర్ణయం గొప్పదే.. అమలు ఉట్టిదే..**

రెండు వేల ఇరవై ఆరు--ఇరవై ఏడు విద్యా సంవత్సరం నుంచి, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే విధమైన కొత్త యూనిఫామ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఉన్న యూనిఫామ్‌ల విషయంలో నాణ్యత, రంగుపై వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త మార్పులు తీసుకురావాలని భావించింది. ఇది విద్యార్థుల్లో సమానత్వ భావన పెంచడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్న ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయంగా భావిస్తున్నారు. అయితే నిర్ణయం ప్రకటించడం ఒక దశ అయితే.. అది ప్రతి విద్యార్థి చేతికి చేరేలా చూడటం మరో కీలక దశ. ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సరఫరా ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. రెండు నెలల తర్వాత కూడా కొందరు



విద్యార్థులు కొత్త దుస్తుల కోసం ఎదురుచూడాల్సి రావడం, అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**జాతీయ పండుగ వేళ.. పిల్లల చూపు కొత్త దుస్తుల వైపు.**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సమీపించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇలాంటి ప్రత్యేక రోజుల్లో విద్యార్థులు కొత్త యూనిఫామ్‌లో పాఠశాలకు హాజరవుతారని తల్లిదండ్రులు ఆశించారు. అయితే కొత్త దుస్తులు ఇంకా అందని పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గతంలో ఇచ్చిన యూనిఫామ్‌లతోనే వేడుకలకు హాజరు కావాల్సి వస్తుందేమోనన్న ఆందోళన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. విద్యార్థులకు కొత్త యూనిఫామ్ అందించడం కేవలం దుస్తుల పంపిణీగా చూడకూడదని.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆత్మవిశ్వాసంతో ముడిపడిన అంశంగా పరిగణించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**21 వస్తువుల హామీ.. పంపిణీకి ముహూర్తం ఎప్పుడు?**

యూనిఫామ్ అంశానికి తోడు విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కూడిన కిట్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యా ఖర్చుల్లో కొంత ఉపశమనం లభిస్తుందని తల్లిదండ్రులు ఆశించారు. కానీ విద్యా సంవత్సరం ముందుకు సాగుతున్న కొద్దీ కిట్ పంపిణీపై ఎదురుచూపులు పెరుగుతున్నాయి. కిట్‌లో ఉండే వస్తువులు ఏమిటి? అవి ఎక్కడ సిద్ధమవుతున్నాయి? పాఠశాలలకు ఎప్పుడు చేరతాయి? విద్యార్థులకు ఏ తేదీ నుంచి పంపిణీ చేస్తారు? అనే అంశాలపై స్పష్టమైన సమాచారం లేకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన పథకం విద్యార్థులకు చేరినప్పుడే దాని ప్రయోజనం కనిపిస్తుంది. ప్రకటన స్థాయిలోనే నిలిచిపోతే.. పథకం ఉద్దేశం ఎంత మంచిదైనా ఫలితం మాత్రం విద్యార్థికి అందదు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, విద్యా సామగ్రి, కిట్లు అందించాలంటే ముందస్తు ప్రణాళికతో పాటు, సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ అవసరం.

**పాఠశాలలపై ప్రభావం.. తల్లిదండ్రుల్లో ప్రశ్నలు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఒకవైపు చర్యలు చేపడుతున్న సమయంలో.. మరోవైపు విద్యార్థులకు అందాల్సిన ప్రాథమిక సౌకర్యాలు ఆలస్యం కావడం విరుద్ధ పరిస్థితిని సృష్టిస్తోందని తల్లిదండ్రులు అంటున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలతో పోల్చుకుంటున్న విద్యార్థులకు తమ పాఠశాలలోనూ సమయానికి యూనిఫామ్, అవసరమైన సామగ్రి అందాలన్న ఆకాంక్ష సహజమే. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాలంటే ఇలాంటి పథకాలను ప్రకటించడమే కాకుండా.. అవి సమయానికి అమలు కావాలని వారు కోరుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే కొత్త యూనిఫామ్‌లు అందని పాఠశాలలను గుర్తించి అత్యవసరంగా సరఫరా చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. పాఠశాలల వారీగా అవసరమైన యూనిఫామ్‌ల సంఖ్యను సమీక్షించి కొరత ఉన్న చోట తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా 21 రకాల వస్తువులతో కూడిన కిట్ పంపిణీపై విద్యాశాఖ స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని కోరుతున్నారు. కిట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పంపిణీ చేస్తారో విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందుగానే తెలియజేయాలని అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అనేది కేవలం భవనాలు, తరగతి గదులు, పాఠ్యాంశాలకే పరిమితం కాదు. విద్యార్థికి అవసరమైన ప్రతి వస్తువు సకాలంలో అందడం కూడా అదే వ్యవస్థలో భాగమే. ఒక విద్యార్థికి కొత్త యూనిఫామ్ అందడం చిన్న విషయం అనిపించవచ్చు. కానీ వేలాది మంది విద్యార్థులకు అదే సకాలంలో అందకపోతే అది పరిపాలనా వ్యవస్థ పనితీరును ప్రశ్నించే అంశంగా మారుతుంది. అదే విధంగా 21 రకాల వస్తువులతో కూడిన కిట్ ఒక కుటుంబానికి చిన్న సహాయం కావచ్చు.. లక్షలాది కుటుంబాలకు మాత్రం అది గణనీయమైన ఆర్థిక ఉపశమనం. అందుకే ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాలపై కాకుండా.. విద్యార్థుల చేతుల్లో కనిపించాల్సిన అవసరం ఉంది. పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలోనైనా అధికారులు వేగం పెంచి, కొత్త యూనిఫామ్‌ల సరఫరాను పూర్తి చేయడంతో పాటు విద్యార్థి కిట్ పంపిణీపై స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరగాలంటే హామీలు వినిపించడం కాదు.. వాటి ఫలితం పాఠశాల గుమ్మం వద్ద కనిపించాలి.



## బిజెపి ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

**జాతీయ స్ఫూర్తిని కొనసాగించాలి..**

**బిజెపి రాష్ట్ర నాయకులు మర్రిపెల్లి సత్యమ్.**

జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్): దేశంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయవాదం,దేశ ప్రజల్లో ఐక్యతను నింపడమే హర్ ఘర్ తిరంగా యాత్ర లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రిపెల్లి సత్యమ్ అన్నారు. బిజెపి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పెగడపల్లి మండల కేంద్రంలో తిరంగా యాత్ర నిర్వహించారు. బిజెపి నాయకులు కార్యకర్తలు జాతీయ జెండాలు చేతగాని పుర వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు పార్టీలకు అతీతంగా దేశంలోని అన్ని గ్రామాల్లో తిరంగా యాత్ర నిర్వహించి జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాలని ప్రతి ఒక్క భారతీయుడు వారి వారి ఇండ్లపై జాతీయ జెండా ఎగరేయాలని స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను స్మరించుకుని వారి త్యాగాలను దేశ ప్రజలకు తెలియజేసేలా దేశవ్యాప్తంగా తిరంగా యాత్ర నిర్వహిస్తుంది అన్నారు. జాతీయ జెండా మన జాతీయ గౌరవానికి ప్రత్యేక మాత్రమే కాదని కోట్లాది భారతీయులను ఒకే తాటిపైకి తీసుకువచ్చే దేశ ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి ప్రధాన కార్యదర్శులు తోడేటి గట్టయ్య కోట మల్లేశం కొత్తూరి బాబు బీజేవైఎం మండల అధ్యక్షులు జక్కుల హరీష్ ఓబీసీ మండల అధ్యక్షులు కూన కుమార్ గిరిజన మోర్చా మండల అధ్యక్షులు అజ్మీర ఇంద్రా నాయక్ దళిత మోర్చా మండల అధ్యక్షులు తడగొండ శ్రీనివాస్ మండల నాయకులు చింతకింది కిషోర్,తడగొండ అంజన్న,నేదరి సాయి కృష్ణ, కన్నం పవన్ కుమార్,పూసాల సునీల్,పెద్ది భీరయ్య, గణవేని శేఖర్, పోతుగంటి రాజేశం, బూరుగు నిఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ కొత్త దరఖాస్తుల ఆహ్వానం

గండిపేట్,(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి కొత్త దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మా రెడ్డి తెలిపారు. ఆగస్టు 31 వ తేదీ వరకు అర్హత కలిగిన వారు చేయూత పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. చేయూత పింఛన్ పథకానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు మరియు ఇతర పూర్తి వివరాల కోసం నార్సింగి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు నివాళులర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ మృతదేహానికి పలువురు ఉన్నత అధికారులు, నాయకులు నివాళులర్పించారు.సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండాలో బుధవారం నవీన్ అంత్యక్రియలు జరిగాయి. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఎస్ తోపాటు అటవీశాఖ ఉన్నత అధికారులు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం డిఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ పలువురు ప్రజాప్రతినిధులు నవీన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం తరుపునా అండహా ఉంటామని తెలిపారు. నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కలెక్టర్ తో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మృతుడు నవీన్ కు భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం

**సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్....**

**ఏచూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేద్దాం..పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్**




ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: భారత కమ్యూనిస్టు ఉద్యమంలో విశిష్ట నాయకుడిగా, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా వరంగల్ క్రాస్ రోడ్డులోని సిపిఎం పార్టీ పాలేరు డివిజన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్ అధ్యక్షుడు జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి తన జీవితాంతం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వ పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, మతోన్మాద రాజకీయాలను, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే సీతారాం ఏచూరికి అందించే నిజమైన నివాళి అని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి మీద రాసిన విప్లవ కవితను చదివి అందరిలో స్ఫూర్తిని నింపారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల ముందు తీసుకెళ్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఊరట సుదర్శన్ రెడ్డి, ఖమ్మం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు,పాలేరు డివిజన్ ప్రజా నాట్య మండలి కార్యదర్శి నందిగామ కృష్ణ,రైతు సంఘం అధ్యక్షులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు మల్లెబోయిన రాజశేఖర్, పొన్నం వెంకటరమణ, అనీష్,పగిడిపల్లి ఉపేందర్, గుంటి వెంకన్న, పుల్లయ్య,కస్తాల ఆంటోనీ, కుమ్మరి కుంట్ల శ్రీను, నాగరాజు, సరస్వతీ, నాగమ్మ భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య,ఉచిత దుస్తులు పంపిణీ : గ్రామ సర్పంచ్ గందె. ప్రవీణ్ కుమార్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనముతో పాటు ఉచితంగా దుస్తులు అందజేస్తారని అందుకే ప్రతి ఒక్క తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కుసుమసముద్రం గ్రామ సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ సూచించారు. వికారాబాద్ జిల్లా మండలంలోని కుసుమసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉప సర్పంచ్ గుడిసె పద్మ కృష్ణయ్య, వార్డు సభ్యులు మోతుకూరి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు మహిళా సంఘాల సభ్యులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.